నిషిత కాలేజీలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



జిల్లా కేంద్రంలోని నిషిత డిగ్రీ కాలేజ్‌లో 1994 నుండి 2024 చదివిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వలు సాంస్కృతి కార్యక్రమం నిర్వహించారు. అంతేకాకుండా కళాశాల యాజమాన్యం ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు ఏఏ రంగాల్లో విద్యా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయి, ఏ ఉద్యోగ అవకాశాలను సంపాదించడం సులభతరం, వాటితో రానున్న రోజులలో ఎంతవరకు అభివృద్ధి చెందవచ్చు అనే అంశాలను పూర్వ విద్యార్థులను నుండి ప్రస్తుత విద్యార్థులకు సూచనలు స్వీకరిస్తూ ముందుకు సాగే విధంగా ఉండాలని పూర్వ విద్యార్థులు ప్రస్తుత విద్యార్థులకు సహకారం అందించాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ నిఖిల్, చీఫ్ పాట్రన్ వినయ్ డైరెక్టర్ పూజ, కోఆర్డినేటర్ రాజు ప్రిన్సిపల్ డాక్టర్ స్వప్న వైస్ ప్రిన్సిపల్ రఘువీర్, పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పండుగకు ఊరెళ్తున్నా..
పోలీసులకు సమాచారం ఇవ్వండి

నవతెలంగాణ-భీంగల్ రూరల్



పండగలకు ఊరేళ్తున్న వారు సమీప పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని, దీంతో పెట్రోలింగ్ చేపట్టి చోరీలు పాల్పడకుండా చర్యలు తీసుకునే అవకాశం ఉందని పలువురు పోలీసులు సూచించారు.

భీంగల్ పట్టణంతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఎవరైనా పండగకు నాలుగైదు రోజుల పాటు ఊరికి వెళ్తే పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని భీంగల్ ఎస్ఐ జి.మహేశ్ శనివారం సూచించారు. ఊర్లకు వెళ్లేటప్పుడు ఇంట్లో విలువైన బంగారు ఆభరణాలు, డబ్బులు వెంట తీసుకువెళ్లాలని లేదా మీ బ్యాంకు ఖాతాలో లాకర్లలో భద్రపరచుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ఇతర గ్రామాలకు వెళ్ళవలసి ఉంటే పోలీసులతో పాటు ప్రక్క ఇంటి వారికి సమాచారం అందించాలని ఎస్సై తెలిపారు. మీరు ఇతర గ్రామాలకు వెళ్లే ముందు గ్రామాలకు వెళుతున్నట్లుగా పోస్టులు పెట్టవద్దని ఎస్సై సూచించారు.

పథకాల అమలుకు
గ్రామ, వార్డు సభలే కీలకం

- వాటిల్లోనే అర్హులను గుర్తించనున్న అధికారులు
- సజావుగా నిర్వహించేందుకు పక్కాగా ఏర్పాట్లు
- జూమ్ మీటింగ్‌లో నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్‌గాంధీ సమీక్ష
- పథకాల అమలు తీరు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి
- అధికారులతో టెలీ కాన్ఫరెన్స్‌లో కామారెడ్డి కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/కామారెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలకు సంబంధించి పల్లెల్లో గ్రామసభలు, పట్టణాల్లో వార్డు సభలు కీలకం కానున్నాయి. కాగా ఈ నెల 21 నుండి 24 వరకు పంచాయతీల పరిధిలో గ్రామ సభలను, మున్సిపల్ పట్టణాలలో వార్డు సభలను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 26 నుండి పై పథకాలను అమలు చేయాలని ప్రభుత్వం సంకల్పించిన నేపథ్యంలో, చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులకు కలెక్టర్ శనివారం జూమ్ మీటింగ్ ద్వారా దిశానిర్దేశం చేశారు. రైతు భరోసా పథకం కింద ప్రభుత్వం పట్టా పాస్ పుస్తకాలు కలిగిన రైతులకు ఖరీఫ్, రబీ సీజన్లను కలుపుకొని ప్రతి యేటా ఎకరానికి రూ .12,000 చొప్పున నేరుగా వారి ఖాతాలలో నగదు జమ చేయనుందని తెలిపారు. భూభారతి(ధరణి) పోర్టల్‌లో నమోదైన వ్యవసాయ యోగ్యమైన భూమి విస్తీర్ణం ఆధారంగా రైతు భరోసా పథకం కింద అర్హులైన వారిని గుర్తించాలని సూచించారు. క్షేత్రస్థాయి సందర్శన జరిపి భూమి వ్యవసాయానికి యోగ్యమైనదా? కాదా? అన్నది నిర్ధారించాలని అన్నారు. మండల స్థాయిలో తహసిల్దార్, మండల వ్యవసాయ అధికారి నేతృత్వంలో కమిటీని ఏర్పాటు చేసుకోవాలని, అలాగే గ్రామస్థాయిలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, రెవెన్యూ అధికారులతో కమిటీలను నియమించుకుని విలేజ్ మ్యాప్, గూగుల్ మ్యాప్ ఆధారంగా వ్యవసాయ యోగ్యమైన భూములను నిర్ధారించాలని కలెక్టర్ సూచించారు. ఈనెల 20వ తేదీ లోపు క్షేత్రస్థాయి సందర్శన ప్రక్రియను పూర్తి చేయాలని గడువు విధించారు. 21 నుండి 24వ తేదీ వరకు నిర్వహించే గ్రామ సభలలో వివరాలను వెల్లడిస్తూ, గ్రామ సభ ఆమోదం పొందిన మీదట సంబంధిత పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలన్నారు.



సాగు భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబాలకు సాలీనా 12 వేల రూపాయలు అందించేందుకు ఉద్దేశించిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి సంబంధించి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో అర్హత కలిగిన కుటుంబాలను గుర్తించాలన్నారు. 2023-24 సంవత్సరంలో కనీసం 20 రోజుల పాటు ఉపాధి హామీ పనులు చేసిన వ్యవసాయ కూలీ కుటుంబాలు ఆత్మీయ భరోసా పథకానికి అర్హులని కలెక్టర్ సూచించారు. అయితే ఎక్కడ కూడా డూప్లికేట్, డబుల్ రేషన్ కార్డులు జారీ కాకుండా పకడ్బందీ పరిశీలన చేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల పథకానికి సంబంధించి కూడా ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా వ్యవహరించాలని అన్నారు. గ్రామ సభలలో ఇందిరమ్మ కమిటీల ప్రతినిధులు పాల్గొనేలా చూడాలన్నారు. విమర్శలకు ఆస్కారం లేకుండా అర్హులైన వారికి లబ్ధి చేకూరేలా చొరవ చూపాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియను, గ్రామ సభలను నిర్దేశిత గడువులోపు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. క్షేత్రస్థాయి సందర్భంగా సేకరించిన వివరాలను, గ్రామ సభలో చేసిన తీర్మానాలను జాగ్రత్తగా భద్రపరచాలని సూచించారు. గ్రామసభల నిర్వహణకు కనీసం రెండు రోజుల ముందే సంబంధిత గ్రామాలు, వార్డుల ప్రజలకు ముందస్తుగా సమాచారం తెలియజేయాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, డీఆర్డీఓ సాయాగౌడ్, ఇంచార్జ్ డీపీఓ శ్రీనివాస్, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, తహసిల్దార్లు, ఏపీవోలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలు తీరు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

నవతెలంగాణ-కామారెడ్డి



రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు ఇందిరమ్మ ఇండ్ల పథకాలను సమర్ధ వంతంగా అమలు చేసేందుకు క్షేత్ర పరిశీలన, జాబితా తయారీ ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శనివారం అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. రైతు భరోసా కార్యక్రమం కింద ఈ నెల 15 నాటికి సన్నాహక ఏర్పాట్లు పూర్తిచేయాలని అన్నారు. గుట్టలు, రోడ్లు, నాలా కన్వర్షన్, భూసేకరణ, లే అవుట్, వ్యవసాయానికి యోగ్యంగా లేని భూములన పరిశీలించాలని తెలిపారు. ఈ నెల 16 నుండి 20 వరకు క్షేత్ర పర్యటన చేసి డేటా సిద్ధం చేయాలని తెలిపారు. గ్రామ సభలో చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఒక కుటుంబాన్ని ఒక యూనిట్‌గా తీసుకోనున్నట్లు తెలిపారు. భూమిలేని వ్యవసాయ కూలీలు కనీసం 20 రోజుల పాటు ఉపాధి హామీ కింద పనిచేసిన డేటా ను సిద్ధం చేయాలనీ తెలిపారు. ఆధార్ నెంబర్ మ్యాపింగ్ చేయనున్నట్లు కలిపారు. గ్రామ సభలో చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. ప్రజా పాలన కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న వారు, గతంలో రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారి డేటా ను సిద్ధం చేయాలనీ తెలిపారు. క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయాలని తెలిపారు. తుది నిర్ణయం గ్రామ, వార్డు సభలో చర్చించనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే రేపటి లోగా పూర్తి చేయాలనీ కలెక్టర్ ఆదేశించారు. అదేవిధంగా ఎంపీడీఓ లు, మున్సిపల్ కమీషనర్‌లు సూపర్ చెక్ చేయాలని అన్నారు. ప్రతీ నియోజక వర్గానికి 3500 ఇళ్లు కేటాయించనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో
వైద్యం నిరాకరణ..?

- సుమారు నాలుగు గంటల పాటు గేట్ వద్ద పడిగాపులు
- గ్రామస్తులు, నాయకుల ఆందోళనతో అడ్మిట్
- ఇలాంటి సమయంలో ఆస్పత్రిలో వైభవంగా సూపరింటెండెంట్ జన్మదిన వేడుకలు నిర్వహించడం పట్ల విమర్శలు



చికిత్స కోసం భార్యను భుజాల మీద తీసుకెళ్తున్న భర్త.. జన్మదిన వేడుకల్లో సూపరింటెండెంట్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఒక వైపు ప్రభుత్వం విద్యా, వైద్య రంగాన్ని బలోపేతం చేసేందుకు చర్యలు చేపడుతుంటే.. మరోవైపు కొందరి నిర్లక్ష్యంతో అభాసు పాలవు తుంది. తాజాగా ఇలాంటి ఘటనే నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చోటుచేసుకుంది. ఫిట్స్ వస్తున్నాయని ప్రభుత్వ ఆస్పత్రికి భార్యను తీసుకొచ్చాడో భర్త. కానీ అక్కడ వైద్యం అందించక పోగా.. ప్రయివేటుకు వెళ్లి స్కానింగ్ చేసి తీసుకు రావాలని ఉచిత సలహా ఇచ్చారు అక్కడి వైద్య సిబ్బంది. చేతిలో చిల్లిగవ్వ లేని నిరుపేదలు.. సుమారు నాలుగు గంటల పాటు ఆస్పత్రి గేటు వద్దే పడిగాపులు కాశారు. తీరా విషయం గ్రామ స్తులకు, పలువురు నాయకులకు తెలవడంతో ఆస్పత్రికి వచ్చి ఆందోళన చేపట్టడంతో అడ్మిట్ చేసుకున్నారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. కాగా మరో వైపు ఆస్పత్రిలో సూపరిం టెండెంట్ జన్మదిన వేడుకలు అట్టహాసంగా నిర్వహించేందుకు శనివారం ఉదయం వరకు ఆస్పత్రిలో స్టేజ్, బెలూన్‌లతో పెద్దఎత్తున ఏర్పాట్లు చేసి వేడుకలు నిర్వహించడం పట్ల విమర్శలు వ్యక్తమవుతు న్నాయి. నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని వివాదాలు చుట్టుముడుతూనే ఉన్నాయి. వివరాల్లోకి వెళ్తే..

రెంజల్ మండలం కల్యాపూర్ గ్రామానికి చెందిన లక్ష్మికి ఫిట్స్ రావడంతో ఆమె భర్త కేతావత్ బిద్యానాయక్.. ఆమెను చికిత్స నిమిత్తం శుక్రవారం జీజీహెచ్ కు తీసుకువచ్చాడు. సదరు మహిళ చికిత్స చేసేందుకు వైద్యులు, సిబ్బంది ఎవరూ పట్టించుకోలేదు. స్కానింగ్ చేయించాలని బిద్యానాయక్ కు సూచించగా, ఆయన జీజీహెచ్ లో చేయాలని కోరాడు. జీజీహెచ్ లో స్కానింగ్ లేదని ప్రైవేట్ ఆస్పత్రిలో చేయించుకురావాలని సూచించారు. దీంతో బిద్యానాయక్ రాత్రి వరకు దిక్కు తోచని స్థితిలో ఉండిపోయాడు. విషయం తెలుసుకున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ పర్సనల్ అసిస్టెంట్ గణపతితో పాటు బీజేపీ నాయకులు, పలువురు గ్రామస్తులు జీజీహెచ్ కు చేరుకుని వైద్యులను నిలదీయంతో వైద్యం అందించారు. కనీసం స్ట్రెచర్ అందుబాటులో లేకపోవడంతో బిద్యా నాయక్ తన భార్యను భుజాలపై వేసుకుని జీజీహెచ్‌లోని అంతస్తులన్నీ తిరుగుతూనే ఉండిపోయాడు. శుక్రవారం నాటి ఈ ఘటన జీజీహెచ్ లోని పరిస్థితికి అద్దం పట్టింది.

ఇంత జరి గినా శనివారం ఉద యమే సూపరిం టెండెం ట్ బర్త్ డే వేడుకల కోసం ఆమె చాంబర్‌ను ఫంక్షన్ హాలును మరిపించేలా డెకొరేట్ చేశారు. ప్రతిమారాజ్ జన్మదిన వేడు కలను ఘనంగా నిర్వహించారు. జీజీహెచ్ లోని వైద్యులతోపాటు సిబ్బంది ఆమెకు శుభాకాంక్షలు తెలిపేందుకు క్యూ కట్టారు. వార్డుల్లో వైద్యులు, సిబ్బంది లేక రోగులు అవస్థలు పడుతుంటే వారి సహాయకులు తమ పరిస్థితి ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఇబ్బందులు పడ్డారు. చాంబర్‌లో సూపరింటెండెంట్ బర్త్ డే వేడుకలపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. జీజీహెచ్‌లో పరిస్థితులు ఎప్పుడు మారుతాయని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇటీవల జిల్లా పర్యటనకు వచ్చిన వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్ వ్యవహారశైలిని తప్పుపడుతూ ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. దీనికి తోడు ఆమె ఫిర్యాదులు, ఆరోపణలు అనేకం ఉండడంతో తీరు మార్చుకో వాలని సూచించినట్లు సమాచారం. ఇంత జరిగినా పరిస్థితిలో మార్పు రావడం లేదని పలు వురు విమర్శిస్తున్నారు.

ఈ విషయమై సూపరింటెండెంట్ ప్రతిమారాజ్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేరు.

సంక్రాంతి సంబరాల్లో అపశృతి

- స్కూళ్లో భోగిమంటలతో విద్యార్థిని కాళ్లకు గాయాలు


కాళ్లకు కాలిన గాయాలతో చికిత్స పొందుతున్న బాలిక

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

స్కూల్లో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో అపశృతి చోటు చేసుకుంది. భోగి మంటలు వెలిగించే సమయంలో విద్యార్థిని కాళ్లకు మంటలు అంటుకోవడంతో తీవ్రంగా గాయపడింది. ఈ ఘటన నిజామాబాద్ నగరంలోని సెయింట్ జేవియర్ ప్రయివేటు స్కూల్లో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. సంక్రాంతి వేడుకల్లో భాగంగా స్కూల్లో కార్యక్రమాలు నిర్వహించారు. అయితే భోగి మంటలు ఏర్పాటు చేయగా.. భోగిమంటలు మరింతగా కనిపించే విధంగా ఉండెందుకు సదరు స్కూల్ ప్రిన్సిపల్ పెట్రోల్ పోయగా.. మంటలు ఉధృతంగా వ్యాపించాయి. ఈ క్రమంలో పెట్రోల్ డబ్బాను విసిరి వేస్తున్న సమయంలో పెట్రోల్ విద్యార్థిని కాళ్లపై పడటంతో ఆమె కాళ్లకు మంటలు అంటుకున్నాయి. దీంతో హుటాహుటన నగరంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు.

చర్యలు తీసుకోవాలి : విద్యార్థి సంఘాల డిమాండ్


మాట్లాడుతున్న అనిల్

స్కూలు యాజమాన్యం నిర్లక్ష్యం వల్ల చిన్నారికి గాయాలు అయ్యాయి అని ఏబిపిఎస్యూ రాష్ట్ర అధ్యక్షులు బోడ అనిల్, టిజివిపి జిల్లా అధ్యక్షులు బొబ్బిలి కళ్యాణ్‌లు అన్నారు. సెయింట్ జేవియర్ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గాయపడ్డ విద్యార్థినికి మెరుగైన వైద్య సాయం అందించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ అధికారులు ఈ పాఠశాలపై చర్యలు తీసుకొని విద్యార్థికి న్యాయం చేయాలని అన్నారు.

మరణించిన సమగ్ర శిక్ష ఉద్యోగినికి
ఎక్స్ గ్రేషియా ప్రకటించాలి

నవతెలంగాణ-కామారెడ్డి

యాదాద్రి భువనగిరి జిల్లాలోని కేజీబీవీ వలిగొండ ప్రధానవంట మనిషి మల్లమ్మ మరణం పట్ల తీవ్ర భ్రాంతిని వ్యక్తం చేస్తూ ప్రభుత్వం వెంటనే ఎక్స్ గ్రేషియా ప్రకటించి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించి ఆ కుటుంబానికి భరోసానివ్వాలని సమగ్రశిక్ష జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శనివారం ఇక్కడ మాట్లాడుతూ 30-12-2024 రోజున 30 కిలోల అన్నం వండిన గిన్నె పొయ్యినుండి కిందకు దించే సమయంలో జారి కడుపు కాలిందని తెలిపారు. బాగా కాలడం వలన ఇన్ఫెక్షన్ సోకిన కారణంగా హైదరాబాదులో హాస్పిటల్ లో ఎమర్జెన్సీ సర్జరీ చేస్తుండగా హార్ట్ స్ట్రోక్ తో కోమా లోకి వెళ్లి శనివారం అంతిమ శ్వాస విడిచారని తెలిపారు. సమగ్ర శిక్ష ఉద్యోగులు నెల రోజుల సమ్మె చేసిన సమయంలో ఇద్దరు మరణించిన వారికి ఎక్స్ గ్రేషియా చెల్లిస్తామని ప్రభుత్వం, అధికారులు హామీ ఇచ్చినారన్నారు. కావున వెంటనే పది లక్షలు ఎక్స్ గ్రేషియా విడుదల చెయ్యాలని ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరుతున్నారన్నారు.

గొర్రెపాటి మాధవరావు జీవితం
పీడిత ప్రజలకు అంకితం

- తుది శ్వాస వరకు తన రచనలతో ప్రజల్లో చైతన్యం కలిగించారు
- తెలుగు రాష్ట్రాల మానవ హక్కుల వేదిక సమన్వయ కమిటీ సభ్యులు ఎస్వి కృష్ణ
- సంస్మరణ సభలో నివాళి అర్పించిన పలువురు

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ



మాట్లాడుతున్న ఎస్వి కృష్ణ

గొర్రెపాటి మాధవరావు జీవితం పీడిత ప్రజలకు అంకితమని తెలుగు రాష్ట్రాల మానవ హక్కుల వేదిక సమన్వయ కమిటీ సభ్యులు ఎస్. వి కృష్ణ అన్నారు. గొర్రెపాటి మాధవరావు సంస్మరణ సభను నిజామాబాద్ నగరంలోన ఎల్లమ్మ గుట్టలోని మాధవరావు ఇంటి వద్ద జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహిం చారు. జంపాల మెమోరియల్ ట్రస్ట్ సభ్యులు ఆకుల పాపయ్య అధ్యక్షతన వహిం చారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా వచ్చిన వి ఎస్ కృష్ణ మాట్లాడుతూ మాధవరావు తన జీవిత కాలం అంత పీడిత ప్రజల హక్కుల కోసం ఆలోచించేవాడని, ఎన్కౌంటర్ బాధితులకు కోర్టు ద్వారా నష్టపరిహారం ఇప్పించిన టువంటి చరిత్ర గొర్రెపాటి మాధవరావుది అన్నారు. తన తుది శ్వాస వరకు తన రచనాలతో ప్రజలను చైతన్యం చేసి ఉద్యమాల వైపు నడిపిం చారని గుర్తు చేశారు. రాజ్యం పట్ల, చట్టం పట్ల, సమాజ మార్పు పట్ల స్పష్టమైన అవగాహన కలిగిన వ్యక్తి అన్నారు. నిరంతరం తన రచనల ద్వారా ఉపన్యాసాల ద్వారా ప్రజలను చైతన్య పరచాడని గుర్తు చేశారు. మానవ హక్కులకు రక్షణ కవచంగా నిలబడ్డారని అన్నారు. ప్రతి సమస్యను హక్కుల కోణంలో ఆలోచించేవాడని తెలిపారు. ప్రజాస్వామికవాదులపై రాజ్యం మోపిన అనేక తప్పుడు కేసులను న్యాయపోరాటం చేసి గెలిచి ప్రజలకు అండగా నిలిచారని పేర్కొన్నారు.

సిపిఐ (ఎం-ఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు వేములపల్లి వెంకటరామయ్య, మనవ హక్కుల వేదిక ఉమ్మడి పూర్వ మాజీ రాష్ట్ర అధ్యక్షులు జీవన్ కుమార్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ ట్రస్ట్ సభ్యులు, మానవ హక్కుల వేదిక నాయకులు, కుటుంబ సభ్యులు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు వామపక్షాల నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్వి కృష్ణ

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే
రోడ్డు ప్రమాదాల నివారణ సాధ్యం

- జిల్లా ఏఎస్‌పి చైతన్య రెడ్డి

నవతెలంగాణ-భిక్కనూర్


ర్యాలీ చేపట్టిన పోలీస్ సిబ్బంది.. హాజరైన ఏఎస్పీ చైతన్యరెడ్డి

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, అప్పుడే రోడ్డు ప్రమాదాలు నివారించొచ్చని ఏఎస్పి చైతన్యరెడ్డి తెలిపారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా శనివారం మండల కేంద్రంలో సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బందికి హెల్మెట్లు,బ్లూ కోల్ట్ జాకెట్లను పంపిణీ చేశారు. అనంతరం రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు పోలీస్ సిబ్బంది, ఆర్టిఏ సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం మండలంలోని కంచర్ల గ్రామంలో ఏర్పాటుచేసిన 14 సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాలను నియంత్రించవచ్చని, అన్ని గ్రామాలలో దాతల సహకారంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అంతకు ముందు తొలిసారి భిక్కనూరు పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ఏఎస్పీ చైతన్య రెడ్డికి సీఐ సంపత్ కుమార్ మొక్కలు ఇచ్చి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు ఆంజనేయులు, రామ్ చందర్ నాయక్, ప్రభాకర్, పుష్పరాజ్, రవాణా శాఖ అధికారి మహమ్మద్ అప్రోచ్ సిబ్బంది, పోలీస్ శాఖ సిబ్బంది, పట్టణ యువకులు, తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్పీని సన్మానించిన వీడీసీ

మండలంలోని రామేశ్వరం పల్లి గ్రామ అభివృద్ధి కమిటీ శనివారం భిక్కనూరు పోలీస్ స్టేషన్ కు విచ్చేసిన ఏ ఎస్ పి చైతన్య రెడ్డిని సన్మానించారు. అనంతరం ఏఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతలకు పోలీసులకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ సంపత్ కుమార్, ఎస్సై ఆంజనేయులు, పోలీస్ సిబ్బంది, వీడీసీ అధ్యక్షులు సూర్యకాంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ ఉపాధ్యక్షులు వినోద్ గౌడ్, వీడీసీ ఉపాధ్యక్షులు రమేష్ రెడ్డి, శశి, సొసైటీ డైరెక్టర్ మోహన్ రెడ్డి, రెడ్డి సంఘం అధ్యక్షులు వెంకటరెడ్డి, సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి రెడ్డి, భూమ్ రెడ్డి, మనోహర్ రెడ్డి, కొండల్ రెడ్డి పాల్గొన్నారు.

వడ్డెర వృత్తిదారుల
సంక్షేమానికి చర్యలు చేపట్టాలి

నవతెలంగాణ-కామారెడ్డి


జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

వడ్డెర వృత్తిదారుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలని తెలంగాణ వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఇడగొట్టి సాయిలు, చేతి వృత్తిదారుల సంఘం జిల్లా కన్వీనర్ వెంకట్ గౌడ్ డిమాండ్ చేశారు. వడ్డెర వృత్తిదారుల ఫెడరేషన్‌కు రూ.5000 కోట్లు కేటాయించి కుటుంబాలను అభివృద్ధి చేయాలని, భూమిలేని నిరుపేదలకు ఐదు ఎకరాల భూమిని ఇవ్వాలని, ఐదు లక్షల బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. వడ్డెర వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం ఎదుట వడ్డెర వృత్తిదారుల సంఘం జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హాజరై మాట్లా డారు. జిల్లాలో ఉన్న క్వారీలను వడ్డెర వృత్తి దారులకు కేటాయించాలని, 50 సంవత్సరాలు నిండిన వృత్తిదారులకు అందరికీ పెన్షన్ ఇవ్వాలని వడ్డెర సొసైటీలో ఉన్న ఒక్కొక్కరికి ఎలాంటి షరతులు లేకుండా బ్యాంకు లోన్ ఇవ్వాలని, ఇందిరమ్మ ఇల్లు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. కాంట్రాక్టు పనుల్లో 30 శాతం రిజర్వేషన్లు కల్పించి ఎలాంటి ఈఎండి లేకుండా ఐదు కోట్ల వరకు పనులు ఇవ్వాలని, సంఘాల రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి రుణాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రాజనర్సు, సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింలు, జిల్లా కార్యదర్శి రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బాలయ్య, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, కొమరయ్య, ఉప్పు రమేష్, పరుశురాం, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో వడ్డెర ఓబన్న జయంతి వేడుకలు

కామారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ వడ్డెర వృత్తిదారుల సంఘం కామారెడ్డి జిల్లా కమిటీ, బిసి కార్పొరేషన్ ఆధ్వర్యంలో వడ్డెర ఓబన్న జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరైనారు. తెలంగాణ వడ్డెర వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఇడగొట్టి సాయిలు జిల్లా నాయకులు, అధ్యక్ష కార్యదర్శులు నర్సింలు, రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బాలయ్య, జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాడాపహాడ్ ఉర్సు ఊరేగింపు

- సందాల్ ఎత్తుకొచ్చిన పోచారం, కాసుల

నవతెలంగాణ-వర్ని



సందాల్ ఎత్తుకెళ్తున్న పోచారం

మండలం లోని జలాల్‌పూర్ గ్రామంలో పెద్దగుట్ట ఉర్సును రాష్ట్ర వ్యవసాయ సలహా దారులు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఆగ్రో చైర్మన్ కాసుల బాలరాజు పారంభించారు. జలాల్ పూర్ గ్రామానికి చెందిన ఇబ్రహీం మొల్ల అనే వ్యక్తి ఇంటి నుంచి పెద్దగుట్ట షాదుల హుసేన్ బాబా కు నైవేద్యంగా బెల్లం, చక్కర సందాల్‌ను గ్రామ పంచాయతీ చావడి దగ్గర ఉంచి ప్రార్థనలు చేశారు. అనంతరం కవాలి పాటలు అలపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని గుర్రం ఒంటె పాదాలను పాలాభిషేకం చేస్తూ మొక్కులు చెల్లించారు. ఫకీర్ల విన్యాసాలు ఆకట్టుకొన్నాయి. అటుగా పోచారం శ్రీనివాస్ రెడ్డి నుంచి మొల్ల ఇబ్రహీం సందాలు (గందాలు) మోసి గుర్రంపై పెట్టి ఫకీర్ల ఆటపాటలు, విన్యాసాల మధ్య ఊరేగింపుగా పెద్దగుట్టకు తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షునిగా జిర్ర మహిపాల్

నవతెలంగాణ-ధర్పల్లి

బీజేపీ మండలాధ్యక్షునిగా జిర్ర మహిపాల్ నియమితులైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలాధ్యక్షునిగా తనను నియమించిన పార్టీ పెద్దలకు, అలాగే తనకు ఈ పదవి రావడానికి సహకరించిన మండల పార్టీ నాయకులకు, అలాగే తోటి కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ కోసం కష్టపడ్డవారికి పార్టీ గుర్తిస్తుందనేందుకు తానే ఒక సాక్ష్యామని అన్నారు. అందుకే మండలంలోని అన్ని గ్రామాల బీజేపీ కార్యకర్తలకు, మండల స్థాయి నాయకులు ప్రతి ఒక్కరూ పార్టీ బలోపేతానికి అందరం కలిసి కట్టుగా పని చేద్దామని అన్నారు.


ఎన్నికైన మహిపాల్

జంబి హనుమాన్ ఆలయంలో అన్నదానం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని జంబి హనుమాన్ ఆలయంలో అన్నదాన కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణానికి చెందిన గుండాజీ యోషిక జన్మదినాన్ని పురస్కరించుకుని 150 మందికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి అడ్వైజర్ గుండాజి సాయన్న, హేమలత, సంపత్, సౌమ్య వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


పూజలు నిర్వహించిన పలువురు

పాఠశాలలో సామగ్రి చోరీ

నవతెలంగాణ-భీంగల్ రూరల్

భీంగల్ పట్టణంలోని బాపూజీనగర్ కాలనీలో గల ఎంపీపీఎస్ స్కూల్లో చోరీ జరిగింది. గుర్తు తెలియని దొంగలు స్కూలులో చొరబడ్డారు. మధ్య రాత్రి సమయంలో స్కూల్ లోపలికి ప్రవేశించి స్కూలుకు సంబంధించిన శాంసంగ్ ట్యాబ్, 25 కిలోల బియ్యం, వంట పాత్రలు ఎత్తుకెళ్లారు. ఈ విషయం గమనించిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శైలజ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయంపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్టు ఎస్సై మహేష్ తెలిపారు.

నేడు స్వామి వివేకానంద జయంతి వేడుకలు

నవతెలంగాణ-ఎడపల్లి

స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఎడపల్లి తాజా మాజీ సర్పంచ్ ఆకుల మాధవి శ్రీనివాస్, తాజా మాజీ 14 వార్డు సభ్యురాలు రాణి సదానంద్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద విగ్రహాన్ని శనివారం శుభ్రం చేశారు. మండల కేంద్రంలోని మంగళ్ పహాడ్ చౌరస్తాలో ఉన్న స్వామి వివేకానంద విగ్రహానికి గ్రామపంచాయతీ పారిశుధ్య కార్మికులతో పాటు సిబ్బందితో శుభ్రం చేయించారు. అలాగే మండలంలోని మంగల్‌పహాడ్ బస్టాండ్‌లో ఉన్న స్వామి వివేకానంద విగ్రహాన్ని తాజా మాజీ సర్పంచ్ బట్టు అనుమలు ఆధ్వర్యంలో మంచినీటితో శుభ్రం చేయించారు. మండల కేంద్రంలోని 14వ వార్డులో గల స్వామి వివేకానంద విగ్రహానికి స్థానిక తాజా మాజీ వార్డ్ సభ్యురాలు రాణి సదనంద్‌తో పాటు మాజీ సర్పంచ్ ఆకుల మాధవి శ్రీనివాస్ ప్రత్యేక చొరవ తీసుకుని శుభ్రం చేయించారు.

జాతీయస్థాయి సీనియర్ సౌత్ జోన్ సాఫ్ట్‌బాల్ పోటీలకు నేహశ్రీ ఎంపిక


నేహశ్రీని అభినందిస్తున్న పాఠశాల బృందం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి మండలంలోని సుద్దపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల కళాశాలకు చెందిన విద్యార్థిని నేహశ్రీ సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నళిని, వైస్ ప్రిన్సిపాల్స్ స్వప్న, వనితా శనివారం తెలిపారు. ఈనెల 5న తూప్రాన్ మండలంలోని మనోహరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సెలక్షన్స్ టోర్నమెంట్‌లో చక్కని ప్రతిభ కనబరిచి ఈనెల 11 నుంచి 13 వరకు తమిళనాడు రాష్ట్రంలోని పాండిచ్చేరిలో జరగబోయే జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలలో పాల్గొంటుందని స్కూల్ ఫిజికల్ డైరెక్టర్ జోష్న, పిఈటి శ్రీలత తెలిపారు. నేహశ్రీకి కోచ్ మౌనిక, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు.

మామిడిపల్లిలో సమత సైనిక దళ్ శిక్షణ శిబిరం


సమత సైనిక దళ్ శిక్షణలో పాల్గొన్న చిన్నారులు, యువకులు, పలువురు

నవతెలంగాణ-మాక్లూర్

మండలంలోని మామిడిపల్లి గ్రామంలో సమత సైనిక దళ్ శిక్షణ శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ శిబిరం రెండు రోజుల పాటు కొనసాగుతుందని, యువకులకు, చిన్నారులకు, అంబేద్కర్ సంఘం సభ్యులకు, యూత్ సభ్యులకు శిక్షణను ఇస్తున్నట్టు అంబేద్కర్ సంఘం జిల్లా అధ్యక్షులు దోనకంటి లింగన్న తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ మెంబర్ జిన్నా జనార్ధన్, ప్రభాకర్, గోదావరిఖని సభ్యులు బడికల కృష్ణ, దళిత నాయకులు బంగారు సాయిలు, ఎడ్ల రాములు, మండలాధ్యక్షులు తెడ్డు శేఖర్, వీడీసీ అధ్యక్షులు డిసి గంగాధర్, గౌరవ అధ్యక్షులు బండారు రాములు, మాల సంఘం అధ్యక్షులు భూపతి రవి, ఎంఎస్‌యూఐ మండలాధ్యక్షులు భూపతి రూత్వేష్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి బస్సులు ఫుల్



నవతెలంగాణ-డిచ్‌పల్లి

పాఠశాలలకు, కళాశాలలకు, ప్రభుత్వ కార్యాలయాలకు వరుసగా సంక్రాంతి పండుగ సందర్భంగా సెలవులు కావడంతో చిన్నారుల నుండి మొదలుకొని పండు ముసలి వరకు తమ స్వంత గ్రామాల్లో పండుగ జరుపుకోవడానికి తరలివెళ్తున్నారు. దానిలో భాగంగానే పట్టణాలు, నగరాల్లో ఉన్న వారు ఆర్టీసీ బస్సుల కోసం ఎదురుచూస్తున్నారు. వచ్చిన బస్సులు సైతం జిల్లా కేంద్రాల నుంచి ఫుల్లుగా వస్తున్నాయి. తమ గ్రామాలకు సమయానికి వచ్చే బస్సుల రాకకోసం ఇందల్‌వాయి బస్టాండ్ ప్రయాణికులతో కిక్కిరిసి పోయింది. వచ్చిన బస్సుల్లో వందకు పైచిలుకు ప్రయాణికులు బస్సుల్లో తరలివెళ్తున్నారు.

ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-ఆర్మూర్

వ్యవసాయ కూలీలకు ప్రభుత్వం రూ.12,000 ఇస్తామని ప్రకటించడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వినయ్‌రెడ్డి చిత్రపటాలకు శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని మండలంలోని కోమన్‌పల్లి గ్రామంలో పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ గ్రంథాలయం చైర్మన్ మార చంద్రమోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు చిన్నారెడ్డి, యువజన కాంగ్రెస్ మండలాధ్యక్షులు తలారి రాకేష్, నవీన్‌రెడ్డి, లవన్ కుమార్, భూమరెడ్డి, మహేందర్, చిన్నారెడ్డి, ప్రవీణ్‌గౌడ్, రాజేశ్వర్, శ్రీనివాస్, శ్రీకాంత్, రాజు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


కంఠేశ్వర్: ఓబన్న చిత్రపటానికి నివాళులర్పించిన సంఘాల ప్రతినిధులు


రెంజల్: చిత్రపటానికి పూలమాల వేస్తున్న వడ్డెర సంఘం సభ్యులు


ఆర్మూర్: ఓబన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న పలువురు

వడ్డె ఓబన్న ధైర్య సాహసాలు అనన్యసామాన్యం

- **జయంతి వేడుకల్లో వక్తలు**

నవతెలంగాణ-విలేకరుల బృందం

కంఠేశ్వర్ : స్వాతంత్ర్య పోరాటంలో వడ్డె ఓబన్న ప్రదర్శించిన ధైర్య సాహసాలు అనన్య సామాన్యమైనవని వక్తలు కీర్తించారు. ఆ మహనీయుడిని స్మరిస్తూ, అధికారికంగా జయంతిని నిర్వహించుకోవడం ఎంతో సంతోషకరమని అన్నారు. వడ్డె ఓబన్న జయంతిని పురస్కరించుకుని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో శనివారం వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. వడ్డె ఓబన్న చిత్రపటానికి అధికారులు, ఆయా సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. బ్రిటీష్ పాలకులను గడగడలాడించిన స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న అని కొనియాడారు. రేనాడు ప్రాంతంలో జన్మించిన ఓబన్న ఆనాడు బ్రిటీష్ పాలకులకు వ్యతిరేకంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జరిపిన సాయుధ పోరులో సైన్యాధ్యక్షుడిగా వీరోచిత పోరాటం చేశారని గుర్తుచేశారు. వడ్డె ఓబన్న ఆశయాల సాధన కోసం కృషి చేయడమే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో బీ.సీ సంక్షేమ శాఖ అధికారిణి స్రవంతి, ఆయా సంఘాల ప్రతినిధులు దండి వెంకట్, పి.వెంకటేష్, నగేష్, శంకర్, బుస్స ఆంజనేయులు, ఎం.రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ : మండల వడ్డెర సంఘం ఆధ్వర్యంలో తమ కుల దైవమైన వడ్డే ఓబన్న వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బ్రిటీష్ వారి నియంతృత్వాన్ని ఎదిరించిన స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డె ఓబన్న అని రెంజల్ మండల వడ్డెర సంఘం అధ్యక్ష కార్యదర్శులు ఎత్తారి సాయిలు, పల్లపు చంద్రశేఖర్ స్పష్టం చేశారు. బ్రిటీష్ వారి అక్రమ పన్నుల వసూళ్లపై ఆయన ఎదిరించిన ధీర శాలి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు వికార్‌పాషా, లచ్చేవారు నితిన్, వడ్డెర సంఘం నాయకులు వడ్డే అంజి, వడ్డే గిరి, వడ్డే బాబు, వడ్డే సాంబ, వడ్డే అనిల్, వడ్డే హనుమంతు, వడ్డే లక్ష్మణ్, వడ్డే నర్సింలు, వడ్డే గంగారెడ్డి, స్థానిక యువత తదితరులు పాల్గొన్నారు.

వడ్డే ఓబన్న జీవిత చరిత్రను ప్రాథమిక పాఠ్యాంశాలలో చేర్చాలి..

ఆర్మూర్ : వడ్డె ఓబన్న జీవిత చరిత్రను ప్రాథమిక పాఠ్యాంశాలలో చేర్చాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్ అన్నారు. 218వ జయంతి సందర్భంగా పట్టణంలోని 2వ వార్డు వడ్డెర కాలనీలో గల వడ్డె ఓబన్న విగ్రహం వద్ద జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. 2వ వార్డ్ కౌన్సిలర్ ఖాందేశ్ సంగీతా శ్రీనివాస్ సభాధ్యక్షతన ముఖ్య అతిథి, విశిష్ట అతిథులుగా హాజరైన పీసీసీ మాజీ కార్యదర్శి శ్రీనివాస్ ఖాందేష్, మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబాగౌడ్ వడ్డె ఓబన్న విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీనివాస్ ఖాందేశ్ మాట్లాడుతూ.. ఉయ్యాలవాడ నరసింహరెడ్డితో పాటు ఓబన్న చేసిన సాహసోపేతమైన భీకర పోరులో సైనిక అధ్యక్షుడిగా వడ్డె ఓబన్న పోషించిన వీరోచిత పాత్రను చరిత్రలో లిఖించదగిన విషయమన్నారు. వడ్డె ఓబన్న తన 9,000 మంది సైనికులతో కలిసి బ్రిటిష్ వారి పై వీరోచిత పోరాటం చేశారని కొనియాడారు. వడ్డె ఓబన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నందుకు కృతజ్ఞతలని తెలిపారు. వడ్డె ఓబన్న ఆశయ సాధన కోసం మనమందరం కృషి చేస్తూ ఆయన అడుగుజాడల్లో నడిచి ఐక్యతతో రాజ్యాధికారం సాధించాలన్నారు. విశిష్ట అతిథి మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్ మాట్లాడుతూ.. వడ్డె ఓబన్న జీవిత చరిత్రను ప్రాథమిక విద్య పాఠ్య పుస్తకాలలో ప్రచురించాలని, ఈ విషయాన్ని ప్రభుత్వానికి వడ్డెరలు రిప్రజెంటేషన్ చేయాలన్నారు. అలాగే వడ్డెరలు ప్రతి గ్రామంలో వడ్డె ఓబన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, గ్రామ గ్రామాన వడ్డెర కమిటీలు ఏర్పాటు చేసి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నాయకత్వాన్ని బలోపేతం చేసి రాజ్యాధికారం కోసం వివిధ స్థాయిల్లో నాయకులుగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా జిందం నరహరి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ వనం శేఖర్, యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు విజయ్ అగర్వాల్, కాంగ్రెస్ నాయకులు ఖాందేష్ సత్యం, మక్కల సాయినాథ్, సంతోష్, వడ్డెర కుల సంఘం పెద్ద మనుషులు అల్లెపు రాజు, ఎల్లయ్య, మాయని ఎల్లయ్య, దండుగుల వెంకటి, బండారి నరేష్, చిన్నయ్య, మహేష్, మక్కల సాగర్, పల్లపు రమేష్, మోహన్, మక్కల ఎల్లయ్య, మక్కల సాయన్న, మక్కల ఎల్లయ్య, వెంకటి, రాపన్ నర్సయ్య, మహిళా సంఘం సభ్యులు సుగుణ, సాయమ్మ ఆర్పీ మమత, నాలుగు వడ్డెర సంఘాల సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం వ్యవసాయ కూలీలను విస్మరిస్తే ప్రతిఘటిస్తాం

- **అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి కృష్ణ, రామకృష్ణ**

నవతెలంగాణ-ఆర్మూర్



మాట్లాడుతున్న అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ

ప్రభుత్వం వ్యవసాయ కూలీలను విస్మరిస్తే ప్రతిఘటిస్తామని అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బి.కృష్ణ, రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని కుమార్ నారాయణ భవన్‌లో శనివారం రాష్ట్ర కమిటీ సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, హామీని నిలబెట్టుకోవాలని ఆయన కోరారు. రెండు పంటలు ముగిసినా.. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా ఇవ్వడంలో మీనమేషాలు లెక్కిస్తుందన్నారు. రైతులకు పెట్టుబడి సాయంగా ఇస్తున్న డబ్బులు లేక రైతులు అప్పుల పాలవుతున్నారని, కాబట్టి ప్రభుత్వం రైతు భరోసాను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పేదింటి కల నెరవేరుస్తామని ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని, కానీ ఎక్కడా అమలుకు పూనుకున్నది లేదన్నారు. సర్వే పేరుతో మాత్రమే కాలయాపన చేస్తుందన్నారు. వ్యవసాయ కూలీలకు భృతి కింద రూ.12వేలు సంవత్సరానికి ఇస్తానని ఇంకా అమలు చేయడం లేదన్నారు. చాలా కాలంగా రేషన్ కార్డులు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రేషన్ షాప్‌ల ద్వారా సన్నబియ్యం అందిస్తానని ఇంకా ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతుభరోసా, ఇందిరమ్మ ఇండ్లు, వ్యవసాయ కూలీలకు రూ.12వేల భృతి, రేషన్ కార్డులను వెంటనే ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కిషన్ తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి ప్రెస్‌క్లబ్ నూతన అధ్యక్షుడికి సన్మానం


నూతన అధ్యక్షుడిని సన్మానించిన పలువురు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్ నూతన అధ్యక్షులుగా ఇటీవల ఎన్నికైన పురుషోత్తంను రాష్ట్ర సహకార సొసైటీ లిమిటెడ్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి సత్కరించారు. ఈ మేరకు శనివారం మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు విచ్చేసిన ఆయనకు కాంగ్రెస్ పార్టీ నాయకులు, నూతన ప్రెస్‌క్లబ్ ఏర్పాటు విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. విషయం తెలుసుకున్న మానాల మోహన్‌రెడ్డి ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు పురుషోత్తంను అభినందించి, శాలువాతో ఘనంగా సత్కరించారు. ప్రెస్‌క్లబ్ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని జర్నలిస్టులకు తెలియజేశారు. కార్యక్రమంలో కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు సుంకెట రవి, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు పడిగేల ప్రవీణ్, నాయకులు నిమ్మ రాజేంద్రప్రసాద్, సుంకెట శ్రీనివాస్, ఊట్నూరి ప్రదీప్, రాములు నాయక్, లింగారెడ్డి, స్థానిక జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ శావులం సాయిలు వర్ధంతి


చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని బోర్గం గ్రామంలో కామ్రేడ్ శావులం సాయిలు 29వ వర్ధంతి వేడుకలను సిపిఐఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా నాయకులు శనివారం ఘనంగా నిర్వహించారు. సాయిలు నిరుపేద ప్రజలకు అండగా నిలిచి సింగూర్, నిజాంసాగర్ నీటి అవసరం కోసం అనేక పోరాటాలను చేసి ఇండ్లు లేని నిరుపేదలకు ఇండ్ల పట్టాలు ఇప్పించారని వారు కొనియాడారు. మల్లెపాడు భూములను నిరుపేదలకు పంచడంలోనూ, వ్యవసాయ విత్తనాలను సబ్సిడీపై ఇప్పించడంలోనూ, నిజాంషుగర్ ఫ్యాక్టరీ సమస్యలపై పోరాటం చేశారని తెలిపారు. ఆయన మరణించి 29 సంవత్సరాలు అయినప్పటికీ ఆయన అడుగుజాడల్లో తాము నిరుపేదలకు అండగా నిలుస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐఎంఎల్ ప్రజాపంథా మాస్‌లైన్ జిల్లా నాయకులు పుట్టి నడిపి నాగన్న, ఎస్కే నసీర్, వడ్డెన్న, పెద్దులు, గోపాల్, సిద్ధ పోశెట్టి, తరుణ్, లక్ష్మణ్, సాయిలు, పోశెట్టి, గోరె పాషా తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పరామర్శ

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి


బాధిత కుటుంబాన్ని పరామర్శించిన జిల్లా అధ్యక్షుడు

మండల కేంద్రంలో స్థానిక సాక్షి రిపోర్టర్ బొడ్డు శంకర్‌ను కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి శనివారం పరామర్శించారు. ఇటీవల రిపోర్టర్ శంకర్ వాళ్ళ అమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయన శంకర్‌ను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. అనారోగ్యానికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన బషీరాబాద్‌లో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన తాజా మాజీ సర్పంచ్ సక్కారం అశోక్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. అశోక్ మృతి పట్ల కుటుంబ సభ్యులకు తన సంతాపాన్ని తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సుంకెట రవి, కమ్మర్‌పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సుంకెట బుచ్చన్న, కిసాన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు పడిగెల ప్రవీణ్, నాయకులు ఊట్నూరి ప్రదీప్, సుంకెట శ్రీనివాస్, నిమ్మ రాజేంద్రప్రసాద్, రాములు నాయక్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి


అవగాహన కల్పిస్తున్న పోలీసులు

మండల కేంద్రంలోని హాసకొత్తూర్ చౌరస్తా వద్ద ప్రజలకు కమ్మర్‌పల్లి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ నరేందర్ మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలను గురించి వివరిస్తూ వాటి భారిన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఆన్లైన్ మోసాలతో ఎంతోమంది తమ జీవితాలను కోల్పోతున్నారని, వాటి పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రస్తుత కాలంలో సైబర్ నేరాలు ఏ విధంగా జరుగుతున్నాయి, భవిష్యత్తులో ఏ విధంగా జరుగుతాయో ప్రజలకు అవగాహన కల్పించారు. వాహనాలను నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. వాహనంపై వెళ్తున్నప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ ఫోన్ మాట్లాడొద్దని సూచించారు. సెల్‌ఫోన్లు మాట్లాడుతూ.. వాహనాలు నడపడం మూలంగా అనేక ప్రమాదాలు జరిగి ఎందరో తమ ప్రాణాలను కోల్పోతున్నారని, అంతేకాకుండా ఎదుటివారిని ప్రమాదాలకు గురి చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ భద్రత ప్రమాణాలు పాటిస్తూ వాహనాలను నడపాలని సూచించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రాజశేఖర్, కానిస్టేబుల్ లింబాద్రి, తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో గోల్డ్ మెడల్

- **సాధించిన శ్రీ భాషిత పాఠశాల విద్యార్థి**


విద్యార్థిని అభినందిస్తున్న పాఠశాల కరస్పాండెంట్

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని శ్రీ భాషిత పాఠశాలకు చెందిన తొమ్మిదవ తరగతి చదువుతున్న ఎల్.సిద్ధార్థ జనవరి ఒకటవ తేదీన ఇండో నేపాల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్ 14 షాట్‌పుట్‌లో గోల్డ్ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పోలపల్లి సుందర్ శనివారం మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్య ఒకటే ప్రాముఖ్యం కాదని.. ఆటలలో కూడా ప్రావీణ్యం చూపాలని చెప్పారు. దానికోసం విద్యార్థుల ఫిజికల్ ఫిట్‌నెస్ కోసం ఆటలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గోల్డ్ మెడల్ సాధించిన ఎల్.సిద్ధార్థను అభినందించారు. అంతేకాకుండా అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లిన పిఈటిలను అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీఎస్సీలో ఆయుష్మాన్ అరోగ్య శిబిరం

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ఘన్‌పూర్‌లో గల సిఎస్సీలో హెల్త్ మేళా ఆయుష్మాన్ ఆరోగ్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. ఈ శిబిరంలో పల్మాలజిస్ట్ డాక్టర్ సాయికుమార్, డెంటల్ సర్జన్ వాణి మెడికల్ ఆఫీసర్ పాల్గొని పలువురిని పరీక్షించి అవసరమున్న వారికి, జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి, ఇతరులకు మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ స్టాప్, వైద్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించిన మండల అధ్యక్షులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ప్రోత్సాహంతో నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ పోటీలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్ గౌడ్, ఎల్లారెడ్డి ఏఎంసీ చైర్మన్ రజిత వెంకట్రామిరెడ్డి క్రమశిక్షణ సంఘం సభ్యుడు రామచంద్రారెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ క్రికెట్లో 12 టీంలు పోటీ పడుతున్నట్లు వారుతెలిపారు. కార్యక్రమంలో మైనారిటీ మండల అధ్యక్షుడు ఇమామ్, ప్రధాన కార్యదర్శి డివిటి కిష్టయ్య, ఎల్లారెడ్డి నియోజకవర్గ యూత్ ప్రధాన కార్యదర్శి సురేందర్ గౌడ్, గులాము హుస్సేన్, మండల మైనార్టీ యూత్ అధ్యక్షుడు శ్రీరామ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కూచిపూడిలో ప్రతిభ చాటిన తోట శ్రీవల్లి


అవార్డు అందుకున్న శ్రీవల్లి

నవతెలంగాణ-లింగంపేట్

సంక్రాంతి సందర్భంగా యూనిక్ ఎవరెస్ట్ ఫౌండర్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన కూచిపూడి నృత్యంలో మే గారం గ్రామానికి చెందిన తోట శ్రీవల్లి ప్రతిభ చాటారు. తెలంగాణ సరస్వతి పండిత్ నిలయం బొగ్గులకుంట హైదరాబాద్ నందు నేషనల్ ప్రీమియర్ అవార్డు కార్యక్రమంలో కూచిపూడి ప్రదర్శన నిర్వహించారు. తోట శ్రీవల్లి ప్రతిభ కనబరిచి బెస్ట్ చైల్డ్ క్లాసికల్ డాన్సర్ అవార్డును రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శ్రీనివాస్ రావు చేతుల మీదుగా అందుకున్నారు.

స్థానిక సంస్థల్లోనూ.. కాంగ్రెస్ జెండా ఎగురవేద్దాం

- సమిష్టిగా సమన్వయంతో సంక్షేమ పథకాలు ప్రజలకు చేరవేద్దాం
- కార్యకర్తలకు, నాయకులకు కాంగ్రెస్ కోఆర్డినేషన్ కమిటీ సూచన

నవతెలంగాణ-విలేకరులబృందం

కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా, సమన్వయంతో పని చేస్తూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేస్తూ స్థానిక సంస్థల్లో సైతం కాంగ్రెస్ జెండా ఎగురవేద్దామని ఆ పార్టీ కోఆర్డినేషన్ కమిటీ నాయకులు సూచించారు. జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు సమావేశాలు, పల్లెనిద్ర కార్యక్రమాలు చేపట్టారు.

గాంధారి : మండల కేంద్రంలో మండల కోఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రజా ప్రభుత్వం చేస్తున్నటువంటి సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే చేస్తున్నటువంటి అభివృద్ధి కార్యక్రమాలను మండల ప్రజలకు వివరిస్తూ రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆకుల లక్ష్మణ్, కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేషన్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల పల్లెనిద్ర..

రామారెడ్డి : ఎల్లారెడ్డి నియోజకవర్గ శాసనసభ్యులు కల్వకుంట్ల మదన్మోహన్ రావు ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు మండలంలోని కన్నాపూర్ తండాలో శుక్రవారం రాత్రి పల్లె నిద్ర చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి పథకాలను అరులైన ప్రతి ఒక్కరికి అందేలా కృషి చేస్తున్నామని, ప్రజా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పథకాలను, అభివృద్ధి పనులను ప్రతి గడపగడపకు తీసుకెళుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ కమిటీ సభ్యులు పన్యాల అంజిరెడ్డి, నాయకులు కిషన్ యాదవ్, మహేష్ యాదవ్, గోవింద్ నాయక్, శంకర్, శర్మ తేజ తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి : వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో మనం నిలబెట్టుకునే అభ్యర్థులను మనం గెలిపించుకోవాలంటూ కాంగ్రెస్ నాయకులు తెలిపారు. శనివారం సంగోజు వాడి గ్రామంలో గడపగడపకు తిరుగుతూ సంక్షేమ పథకాలు తెలియజేసినట్టు కోఆర్డినేషన్ సభ్యులు తెలిపారు. వార్డ్ మెంబర్ నుంచి జెడ్పిటిసి సభ్యుల వరకు మనం బలపరిచిన అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేషన్ సభ్యులు, మాజీ సర్పంచ్ బండారు సంజీవ్, మాజీ ఉప సర్పంచ్ గైని శివాజీ, గ్రామ అధ్యక్షులు లింగం, యూత్ అధ్యక్షులు ప్రశాంత్, ఆసిఫ్, రఫీ, సత్యం, శంకర్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి

భిక్కనూర్ : మండలంలో యూత్ కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి తెలిపారు. శనివారం పట్టణ కేంద్రంలోని ఎస్‌వి గార్డెన్‌లో నూతనంగా ఎన్నికైన మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీరామ్ వెంకటేష్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు దయాకర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గాంధారి : మండలంలోని మాతుసంగెం ఎంపీటీసీ పరిధిలోని పర్మాల తాండాలో మండల కో ఆర్డినేషన్ కమిటీ సభ్యులు మాజీ అధ్యక్షులు సంగని బాలయ్య, జిల్లా కార్యదర్శి మదర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం నిర్వహిం చారు. గ్రామంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ చేసిన అభివృద్ధి కార్యక్రమాలు వివరిస్తు ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి పనులు వివరిస్తూ ప్రజలు, కార్యకర్తలను చైతన్య పర్చాలన్నారు. కార్యక్రమంలో సంగెం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శంకర్‌రావు పటేల్, మాజీ సర్పంచ్ వాజీర్ సంగరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిమ్మోజివాడిలో పల్లె నిద్ర

సదాశివనగర్ : మండలంలోని తిమ్మజివాడి గ్రామం కోఆర్డినేషన్ కమిటీ పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టింది. దీంట్లో భాగంగా నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి పనులను వివరిస్తూ రానున్న స్థానిక ఎలక్షన్లో కాంగ్రెస్ పార్టీ నాయకులను గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గాదరి శ్రీనివాస్ రెడ్డి, ఎస్సీ విభాగం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు మద్దెల బాగయ్య, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వడ్ల రాజేందర్, నాయకులు రూపేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అశోక్ రావు, తిమ్మోజివాడి గ్రామ అధ్యక్షులు సాయిలు తదితరులు పాల్గొన్నారు.


గాంధారి: ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు


రామారెడ్డి: కన్నాపూర్ తాండ గ్రామంలో నిద్రచేస్తున్న నాయకులు


తాడ్వాయి: ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న నాయకులు

చెరువులో గల్లంతైన వ్యక్తి మృతి

- మృతదేహం వెలికితీత


మృతదేహాన్ని బయటకు తీస్తున్న వ్యక్తి

నవతెలంగాణ-రామారెడ్డి

మండలంలోని బట్టు తండాకు చెందిన రామావత్ రవి (28) శుక్రవారం రెడ్డిపేట గ్రా మ శివారులోని దామర చెరు వులో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో గల్లంతైన విషయ విధితమే. కాగా ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో మెదక్ జిల్లా నుండి గజఈ తగాళ్లతో శనివారం గాలింపు చర్యలు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. ఫైర్ సిబ్బంది ఘటనను పరిశీలించారు. భార్య రామావత్ లత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై నరేష్ తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఆసుపత్రికి తరలించారు.

బడి ఈడు పిల్లలు బడిలో ఉండాలి

నవతెలంగాణ-కామారెడ్డి

చదువుకునే వయసులో ఉన్న పిల్లలు బడి బయట కాకుండా బడిలో ఉండాలని ఎంపీపీఎస్ తలమడ్ల ప్రధానోపాధ్యాయులు రమేష్ కుమార్ గౌడ్ అన్నారు. బడి బయటి పిల్లల సర్వేలో భాగంగా ఎంపీపీఎస్ తలమడ్ల ఉపాధ్యాయులు పౌల్ట్రీ ఫారమ్‌ను సందర్శించి బడికి దూరమైన 20 మంది విద్యార్థులను గుర్తించి వారికి వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి ఎంపీపీస్ తలమడ్ల పాఠశాలలో చేర్పించారు. విద్యార్థులను పాఠశాలలో చేర్పించడానికి సహకరించిన పౌల్ట్రీ ఫారం డిజిఎం సుధాకర్ రెడ్డి, మేనేజర్ ఓబులేషకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్, సిఆర్‌పిలు లింగం, సాయిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన మున్సిపల్ చైర్ పర్సన్

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి పట్టణంలోని పిఆర్‌టియు తెలంగాణ క్యాలెండర్‌ను కామారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్ రెడ్డి శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అంబీర్ మనోహర్ రావు, ప్రధాన కార్యదర్శి జనపాల లక్ష్మీ రాజం, రాష్ట్ర నాయకులు ప్రభాకర్, గిరి, సురేందర్, వెంకట్, ఎల్లా గౌడ్, సభావత్ కృష్ణ, బాలచంద్ర, సునీల్, శుభ రత్నం తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేస్తేనే విజయం

నవతెలంగాణ-లింగంపేట్

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు సమన్వయంతో పని చేస్తేనే విజయం సాధ్యమవుతుందని కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు కార్యకర్తలకు సూచించారు. శనివారం మండలంలోని జగదాంబ తండాలో కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు పోల్కంపేట్ గ్రామ మాజీ సర్పంచ్ నాగరాజు ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమన్వయ కమిటీ సభ్యులు, కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. రాబోయే సర్పంచ్, స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు అందరూ ఐక్యంగా ఉండి సమన్వయంతో పనిచేసి పార్టీ అభ్యర్థులను బారి మెజార్టీతో గెలిపించి అభివృద్ధికి బాటలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో జగదాంబ తాండ గ్రామ కమిటీ అధ్యక్షులు సర్వన్ ఉపాధ్యక్షులు దేవేందర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ లక్ష్మణ్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు శ్రీరామ్, యూత్ అధ్యక్షులు గణేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రీడాకారులకు క్రీడా వస్తువులు అందజేత

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండలంలోని మోతే గ్రామానికి చెందిన వాలీబాల్ క్రీడాకారులకు శనివారం మాజీ జెడ్పిటీసీ ఏలేటి శ్రీలత సంతోష్‌రెడ్డి క్రీడా దుస్తులు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోతే గ్రామానికి చెందిన వాలీబాల్ క్రీడాకారులకు ప్రోత్సహించేందుకు క్రీడా దుస్తులు అందిస్తున్నట్టు తెలిపారు. క్రీడాకారులను మరింత ప్రోత్సహిస్తానని తన వంతు సహాయ సహకారాలు అందిస్తానన్నారు. ప్రతి క్రీడాకారుడు తమ ప్రతిభను చాటాలని మండల స్థాయి జిల్లా స్థాయి రాష్ట్రస్థాయి వరకు ఎదగాలని తల్లిదండ్రులకు మోతే గ్రామానికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆయన క్రీడాకారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంజీవరెడ్డి నరేందర్ రెడ్డి శంకర్రావు మధుసూదన్ రెడ్డి సాయిలు పెంటయ్య రాజు క్రీడాకారులు ఉన్నారు.

శాంతి భద్రతలకు ప్రజాప్రతిథులు సహకరించాలి

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలో శాంతిభద్రతల కొరకు ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీ నాయకులు పోలీసులకు సహకరించాలని ఎస్సై ఆంజనేయులు తెలిపారు. శనివారం మండలంలోని అంతంపల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్సై ఆంజనేయులను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నరసింహారెడ్డి, నర్సింలు, నాగరాజు, భూపాల్, లింగం, తదితరులు పాల్గొన్నారు.

చైతన్య పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూరు పట్టణ కేంద్రంలో ఉన్న చైతన్య విద్యానికేతన్ ఉన్నత పాఠశాలలో శనివారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి ముగ్గులు, రంగోలి, గాలి పటాలు ఎగరవేశారు. సంక్రాంతి సెలవులలో విద్యార్థులు జాగ్రత్తలు పాటించి గాలిపటాలను ఎగురవేయాలని పాఠశాల కరస్పాండెంట్ రేణు కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అశోక్ యాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

నేడు రక్తదాన శిబిరం

నవతెలంగాణ-తాడ్వాయి

తాడ్వాయిలో నేడు(ఆదివారం) నిర్వహించే రక్తదాన శిబిరానికి దాతలు హాజరుకావాలని యువ ఫౌండేషన్ నాయకులు గొల్ల నవీన్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. యువజన దినోత్సవ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్టు తెలిపారు. యువతీ యువకులు హాజరై రక్తదానం చేయాలని దీనితో ఇతరుల ప్రాణాలు కాపడిన వారవుతారని పేర్కొన్నారు.

విజ్ఞాన్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు

నవతెలంగాణ-భిక్కనూర్

మండల కేంద్రంలోని విజ్ఞాన్ ఉన్నత పాఠశాలలో సంక్రాంతి సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి సంక్రాంతి ముగ్గులు, రంగవల్లులు, గాలిపటాలను ఎగురవేశారు. ప్రతి ఒక్కరూ సంక్రాంతి పండుగను ఆనందంగా నిర్వహించాలని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలు గాలిపటాలు ఎగరవేసే సమయంలో జాగ్రత్తలు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ విజయ భాస్కర్ రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

గౌడ్‌ల అభ్యున్నతికి కృషి

- జై గౌడ ఉద్యమం క్యాలెండర్ ఆవిష్కరించిన పిసిసి అధ్యక్షుడు


క్యాలెండర్‌ను ఆవిష్కరించిన పిసిసి అధ్యక్షులు

నవతెలంగాణ-కామారెడ్డి

హైదరాబాదులోని తన నివాసంలో జై గౌడ ఉద్యమం కామారెడ్డి జిల్లా క్యాలెండర్‌ను పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గౌడ సమస్యల పరిష్కారానికి జైగౌడ ఉద్యమం చేస్తున్న కృషిని కొనియాడారు. గౌడుల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ పాటు పడుతుందన్నారు. కాటమయ్య రక్ష పేరిట గీతా కార్మికులకు రక్షణతో కూడిన పనిముట్లను అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జై గౌడ్ ఉద్యమం జాతీయ అధ్యక్షులు డాక్టర్ వట్టికూటి రామారావుగౌడ్, టిపిసిసి కార్యదర్శి మాదు సత్యం గౌడ్, హిమాయత్ నగర్ కార్పొరేటర్ జి రామన్ గౌడ్, జై గౌడ్ ఉద్యమం రాష్ట్ర అధికార ప్రతినిధి బాంబోతుల లింగాగౌడ్, జై గౌడ్ ఉద్యమం జిల్లా అధ్యక్షులు రంగోల మురళి గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి అంకెన గారి శ్రీనివాస్ గౌడ్, ప్రశాంత్ గౌడ్, పండరి గౌడ్, శేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ ఆర్యభట్టులో సంక్రాంతి సంబరాలు

నవతెలంగాణ-కామారెడ్డి

సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ ఆర్యభట్టు జూనియర్ కళాశాలలో శనివారం అంగరంగ వైభవంగా సంక్రాంతి పండుగను నిర్వహించినట్టు కళాశాల కరస్పాండెంట్ గురువేందర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సంబరాలు అందరిని మంత్రముగ్ధులు చేసే రీతిలో విద్యార్థుల రంగవల్లులతో, ఆటాపాటలతో, కేరింతలతో భోగి మంటల కార్యక్రమం అందరిని ఎంతగానో అలరించాయన్నారు. విద్యార్థులందరికి పండగ వైభవాన్ని తెలుపుతూ భవిష్యత్ నిర్దేషం చేస్తూ, వారి వారి కుటుంబ సభ్యులకు పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలోకళాశాల ప్రిన్సిపల్ కోఆర్డినేటర్ - రవి, హన్మంతరావు, సరేష్ గౌడ్, జైస్ ప్రిన్సిపల్ సురేష్ రెడ్డి, వెంకటేష్, అడ్వయిజర్ స్వామి , అధ్యాపక బృందం అధికసంఖ్యలో విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

2కే రన్‌లో యువత పాల్గొనాలి

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలో నేడు (ఆదివారం) నిర్వహించే 2కె రన్‌లో యువతి యువకులు పాల్గొనాలని యువ ఫౌండేషన్ అభ్యర్థి గొల్ల నవీన్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. యువజన దినోత్సవ సందర్భంగా నిర్వహిస్తున్నామని ఈ రన్ ఉదయం 6:30కు తాడ్వాయి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల నుంచి ప్రారంభం కానున్నట్టు తెలిపారు.

ఘనంగా ఒడ్డె ఓబన్న జయంతి వేడుకలు


ఓబన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించిన పలువురు

నవతెలంగాణ-భిక్కనూర్/లింగంపేట్

మండలంలోని రామేశ్వర్ పల్లి గ్రామంలో ఒడ్డె ఓబన్న జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్ రెడ్డి గ్రామంలో ఉన్న ఒడ్డె ఓబన్న విగ్రహానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలు నిర్వహించారు. అనంతరం వడ్డె ఓబెన్‌గా చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిసిబి చైర్మన్ ఎడ్ల రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, వీడిసి అధ్యక్షులు సూర్యకాంత్ రెడ్డి, సీనియర్ నాయకులు మనోహర్ రెడ్డి, వినోద్ గౌడ్, రమేష్ రెడ్డి, రాజు, వడ్డె సంఘం అధ్యక్షులు రాజ్యం, సంఘం సభ్యులు, ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట్ : మండలంలోని ఆయా గ్రామాలలో వడ్డే ఓబన్న జయంతి వడ్డెర కులస్తులు ఘనంగా శనివారం నిర్వహించారు. మండలంలోని రాంపూర్, లింగంపేట్, మోతే, కోర్పోల్, నల్లమడుగు గ్రామాలలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వడ్డెర జాతికి చేసినటువంటి సేవలను వారు కొనియాడారు. కార్యక్రమంలో వడ్డెర కులస్తులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

బిఐఎస్ కార్నివాల్‌లో

ప్రభుత్వ పాఠశాలకు ద్వితీయ బహుమతి



బిఐఎస్ స్టాండర్డ్స్ కార్నివాల్‌లో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-భిక్కనూర్

బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ కార్నివాల్ 2025లో పట్టణ కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు ద్వితీయ బహుమతి లభించిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనాథ్ తెలిపారు. శనివారం హైదరాబాద్ లో జరిగిన బిఐఎస్ స్టాండర్డ్స్ కార్నివాల్ 78వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సంఘమిత్ర పాఠశాలలో కార్యక్రమాన్ని నిర్వహించారు. బిఐఎస్ ఆహ్వానం మేరకు ప్రధానోపాధ్యాయుల శ్రీనాథ్, సైన్స్ ఉపాధ్యాయులు రాజు, సరిత ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు నందిని, మహేష్, కీర్తన, విశ్వక్ రాజు రూపొందించిన ప్రదర్శన ఫార్మర్స్ బాటన్, ఇన్సెక్ట్ రిపెలెంట్, స్మార్ట్ ఇరిగేషన్ ఫర్ అగ్రికల్చర్ ప్రదర్శనకు ద్వితీయ బహుమతి లభించిందని తెలిపారు. ద్వితీయ బహుమతిని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ శిల్పవల్లి, బిఐఎస్ అధికారి పీవీ శ్రీకాంత్ ఉత్తమ ప్రదర్శనకు విద్యార్థులకు, ఉపాధ్యాయ బృందానికి అందజేశారు. ద్వితీయ బహుమతి రావడం పట్ల విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ


లబ్దిదారులకు చెక్కులు అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-తాడ్వాయి/లింగంపేట్/సదాశివనగర్

మండలంలోని చిట్యాల, ఎర్రపాడు, నందివాడ, తాడ్వాయి, గ్రామాల్లో సీఎం సహాయనిది చెక్కులు పంపిణీ చేసినట్టు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జూకంటి వెంకటరెడ్డి శనివారం తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జక్కుల రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షులు, లక్ష్మణ చారి, మాజీ ఉపసర్పంచ్ సంతాజి గారి సుధాకర్ రావు, లక్ష్మణరావు మాజీ సర్పంచ్ కవిత, పులి బాబు, పులి ప్రభాకర్, మండల మహిళా అధ్యక్షురాలు బాలం బాయ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట్ : మండల కేంద్రంలోని నెహ్రూ నగర్ కాలనీకి చెందిన నమిండ్ల రాజు కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర నారా గౌడ్ చేతుల మీదుగా అందజేశారు. ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ.60 వేల రూపాయల చెక్కును మంజూరు చేశారు. ఎమ్మెల్యేకు కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర నారా గౌడ్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ డాక్టర్ జొన్నల రాజు మండల సమన్వయకర్త వంజరి ఎల్లమ్మయ్య, నాయకులు పాల్గొన్నారు.

సదాశివనగర్ : సదాశివనగర్ మండల కేంద్రంలో శాసనసభ్యులు మదన్ మోహన్ ఆదేశాల మేరకు శనివారం లబ్దిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేసినట్టు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ వైస్ ఎంపీపీ గాదరి శ్రీనివాస్ రెడ్డి, ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షులు మద్దెల భాగయ్య మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వడ్ల రాజేందర్, నగర్ గ్రామ అధ్యక్షులు చిందం రాజయ్య, ఎస్సీ విభాగం మండల జనరల్ సెక్రెటరీ జగ్గ బాలరాజ్, సీనియర్ నాయకులు లింభారెడ్డి చిన్నమని, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షునిగా గంగారం



నవతెలంగాణ-లింగంపేట్

ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులుగా నెల్లూరి గంగారాంను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం మండల కేంద్రంలోని ఎమ్మార్పీఎస్ అనుబంధ విభాగాల సమావేశం నిర్వహించారు. సమావేశానికి కామారెడ్డి జిల్లా పర్యవేక్షకులు మంథని సామ్యెల్ మాదిగ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో నూతనంగా మండల కమిటీని ఎన్నుకున్నారు. అధికార ప్రతినిధి గరిగె సంగయ్య, ప్రధాన కార్యదర్శి మాసాని సాయిలు, ఉపాధ్యక్షులు మెట్టు కిషన్, సహాయ కార్యదర్శి గన్నారం ఆశయ్య, కోశాధికారి రాపర్తి చిన్న సంగయ్య, సలహాదారులుగా ఉసేన్ రాజయ్య, లెగ్గెల రాజు, ద్యామనిభూపతి భూమిని, పోషయ్య, రాపర్తి సాయిలు, మాదిగ యువసేన మండల అధ్యక్షులు సాతెల్లి సంగమేశ్వర్, మాదిగ ఉపాధ్యక్షులు గన్నారం అల్లూరి, ప్రధాన కార్యదర్శి కుచ్చులకంటి సాయిరాం, సహాయ కార్యదర్శి దేవుని పరువయ్య, కోశాధికారి బాయికాడి బాలరాజు, సలహాదారులు గన్నారం శంకర్, పుర్రె శేఖర్‌లు ఎన్నికయ్యారు. వారిచే ప్రమాణస్వీకారాన్ని చేయించారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి


మృతి చెందిన షేక్ కరిమాబి

నవతెలంగాణ-నవీపేట్

పోలీస్ స్టేషన్ పరిధిలోని జన్నేపల్లి గ్రామానికి చెందిన షేక్ కరిమాబి (66) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఎస్సై వినయ్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జన్నెపల్లి గ్రామానికి చెందిన కరిమాబి శుక్రవారం ఇంటి నుంచి జన్నేపల్లి చౌరస్తాకు నడుచుకుంటూ వచ్చి తిరిగి వెళుతుండగా ఎస్-ఎస్ఆర్ పాఠశాల ఎదురుగా ద్విచక్ర వాహనం ఢీకొనగా ఛాతి భాగంలో, కాళ్లకు, చేతులకు గాయాలు కాగా 108 వాహనంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స కోసం తరలించారు. శనివారం చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. ద్విచక్ర వాహనదారుడు నాడాపూర్‌కు చెందిన జ్ఞానేశ్వర్‌కు సైతం గాయాలై చికిత్స పొందుతున్నాడు. మృతురాలి మనవడు నిఖత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్ కుమార్ తెలిపారు.

బీజేపీ మండలాధ్యక్షుడిగా కన్నెపల్లి ప్రసాద్

- నియామకపత్రాన్ని అందజేసిన ఎంపీ అరవింద్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

బిజెపి పార్టీ మండలాధ్యక్షుడిగా కన్నెపల్లి ప్రసాద్ నియామకమయ్యారు. నియామకపత్రాన్ని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యుడు ధర్మపురి అరవింద్ శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, బిజెపి జిల్లా అధ్యక్షుడు దినేష్, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, రూరల్ కన్వీనర్ పద్మారెడ్డి, తన్నీరు వాసు, పలు మండలాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.


నియామకపత్రాన్ని అందజేస్తున్న ఎంపీ

రోడ్డుప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి


మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

నవతెలంగాణ-మద్నూర్

బైక్‌ను ఆటో ఢీకొన్న ఘటనలో గాయపడ్డ సుధీర్ అనే వ్యక్తి నాందేడ్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందినట్టు ఎస్ఐ విజయ్‌కొండ తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం స్కూటీ వీలర్ పై వెళ్తున్న సుధీర్‌కు ఆటో ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఘటన స్థలాన్ని ఎస్ఐ విజయ్ కొండ సందర్శించి గాయపడ్డ వారిని ఆసుపత్రులకు తరలించారు. సుధీర్‌ను హుటాహుటిన నాందేడ్ ఆసుపత్రికి తరలించారు. కాగా పరిస్థితి విషమించి శనివారం మృతిచెందాడు. ఆటో డ్రైవర్ తులసిరామ్‌కు సైతం గాయాలు కాగా దేగ్లూర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టినట్టు ఎస్ఐ తెలిపారు.

జాతీయ యువజన ఉత్సవాలకు ఉమ్మడి జిల్లా యువజన అధికారిణి


యువతి, యువకులతో ఉమ్మడి జిల్లా యువజన అధికారిణి శైలి బెల్లాల్

నవతెలంగాణ-కంఠేశ్వర్

భారత ప్రభుత్వం ప్రతి సంవత్సరం జనవరి 12న స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నిర్వహించే జాతీయ యువజన ఉత్సవాలు దేశ రాజధాని ఢిల్లీలో వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హాజరుకానున్నారు. జాతీయ యువజన ఉత్సవాలలో పాల్గొనేందుకు అన్ని రాష్ట్రాల నుంచి వివిధ పోటీల ద్వారా ఎంపిక చేయబడ్డ యువతీ యువకులకు ఆహ్వానం అందించారు. అందులో భాగంగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఎంపిక చేయబడ్డ యువతి యువకులకు ఇన్చార్జిగా నిజామాబాద్ జిల్లా యువజన అధికారిని శైలి బెల్లాల్ నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి వచ్చిన బృందానికి రామ్మోహన్ నాయుడు, తెలంగాణ నుంచి వచ్చిన బృందానికి జి.కిషన్‌రెడ్డి స్వాగత విందును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా యువతి యువకులతో కేంద్ర మంత్రులు తమ తమ ప్రాంతాలలోని విశేషాల గురించి అడిగి తెలుసుకున్నారని, కేంద్ర ప్రభుత్వం యువత కోసం అమలు చేస్తున్న పథకాల గురించి భవిష్యత్తులో ప్రభుత్వం యువత కోసం చేయబోతున్న కార్యక్రమాల గురించి వివరించినట్టు తెలిపారు. నిజామాబాద్ కామారెడ్డి ఉమ్మడి జిల్లాలో యువతి యువకుల కోసం కేంద్ర భారత ప్రభుత్వం నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థను నెలకొల్పాలని తద్వారా ఉమ్మడి జిల్లా యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని ఆ దిశగా చొరవ తీసుకొని శిక్షణ సంస్థను కేటాయిస్తే దాని పూర్తి నిర్వహణ బాధ్యతను తాము తీసుకుంటామని ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో విన్నవించినట్టు జిల్లా యువజన అధికారిని శైలి బెల్లాల్ తెలిపారు. కేంద్ర మంత్రులు తమ వినతికి సానుకూలంగా స్పందించి తప్పకుండా ఆ విషయం పట్ల ఆలోచిస్తామని సంబంధిత మంత్రిత్వ శాఖతో చర్చించి నైపుణ్య అభివృద్ధి కేంద్రం ఏర్పాటు గురించి చొరవ తీసుకుంటామని తెలిపినట్టు పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల ప్రతినిధిగా జాతీయ యువజన ఉత్సవాలలో పాల్గొనడం ఒక గొప్ప అనుభూతిగా ఉందని తనను నమ్మి ఈ అవకాశాన్ని కల్పించిన యువజన మంత్రిత్వ శాఖకు ధన్యవాదాలు తెలుపుతున్నట్టు ఈ సందర్భంగా శైలి బెల్లాల్ తెలిపారు.

పాలనకు బహుదూరం

- సమస్యల వలయంలో కేసీఆర్ కాలనీ
- సమస్యలు పరిష్కరించాలని కాలనీ వాసుల ఆందోళన

నవతెలంగాణ-బాల్కొండ

గత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిరుపేదల కోసం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలనే ఆలోచనతో లబ్దిదారులకు ఇండ్లు నిర్మించి ఇచ్చింది. బాల్కొండ మండల కేంద్రంలో మొదటి విడతగా 99 మంది లబ్ధిదారులకు ఎంపిక చేసి వారికి ఇండ్లు అందజేసింది. ప్రస్తుతం కనీస వసతులు లేక డబుల్ బెడ్ రూమ్ లబ్దిదారులు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారు. గ్రామానికి దూరంగనే కాకుండా ప్రజా పాలనకు సైతం నోచుకోలేకపోతున్నారు. సమస్యలతో అనుదినం ఇబ్బందులకు గురవుతున్నారు. శనివారం కాలనీవాసులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన వ్యక్తం చేశారు


ఆందోళన చేస్తున్న కాలనీవాసులు

సెప్టిక్ ట్యాంకులు నిండి రోడ్లపైకి వస్తున్న మురికి నీరు..

పరిసరాల పరిశుభ్రత బాగుంటేనే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారు. కానీ ప్రస్తుతం కెసిఆర్ కాలనీలో నివాసముంటున్న కాలనీవాసులకు పారిశుధ్యం లోపించడం తలనొప్పిగా మారింది. కాలనీలో సెప్టిక్ ట్యాంకులు నిండి రోడ్లపై, మురికి కాలువలో ప్రవహిస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోందని, దాంతో కాలనీలో ఉండలేకపోతున్నామని కాలనీవాసులు వాపోయారు. మురికి నీరుతో దోమల బెడద ఎక్కువగా ఉందని దానితో అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని కాలనీవాసులు వాపోయారు.

సమస్యలు పరిష్కరించండి



మా కాలనీ గ్రామానికి దూరంగా ఉండటంతో సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కావడం లేదు. మా కాలనీలో చాలా సమస్యలున్నాయి. ముఖ్యంగా సెప్టిక్ ట్యాంకులు నిండి పోయాయి. మురికి నీరుతో దుర్వాసన వస్తుంది. వాటిని వెంటనే సరి చెయ్యాలి. స్థానిక అధికారులకు సమస్యను తెలియజేశాం. వారు అది మేము చేసే పని కాదని తెలియజేశారు. ఉన్నతాధికారులు స్పందించి త్వరగా మా సమస్యలు పరిష్కరించాలి.

- ఈర్ల దేవిదాస్, కెసిఆర్ కాలనీవాసి బాల్కొండ.


సెప్టిక్ ట్యాంక్ పైపు నుంచి పారుతున్న మురికి నీరు

వడ్డెర వృత్తిదారులకు
సొసైటీలకు రిజర్వేషన్ కల్పించాలి

- వడ్డెర వృత్తిదారుల సంఘం జిల్లా సలహాదారుడు వల్లపు వెంకటేష్
- ఘనంగా వడ్డెర ఓబన్న జయంతి

నవతెలంగాణ-కంఠేశ్వర్

వడ్డెర వృత్తిదారులకు గుట్టలపై సొసైటీలకు 30శాతం రిజర్వేషన్ కల్పించాలని వడ్డెర వృత్తిదారుల సంఘం జిల్లా సలహాదారుడు వల్లపు వెంకటేష్ అన్నారు. శనివారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని నాందేవ్‌వాడలో చేతి వృత్తిదారుల సంఘం కార్యాలయం ముందు జెండాను ఆవిష్కరించారు. అనంతరం వల్లపు వెంకటేష్ మాట్లాడుతూ.. వడ్డెర ఓబన్న జయంతి ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం స్వాగతిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. బీసీ రిజర్వేషన్ అమలు చేస్తామని నేటికీ అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. రిజర్వేషన్ ప్రకారం స్థానిక సంస్థల్లో కూడా వడ్డెర్ల వాటా రిజర్వేషన్ కల్పించాలని పేర్కొన్నారు. చదువు లేని వారందరికీ చదువుకోవడానికి ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని, వడ్డెర ఫెడరేషన్‌కు రూ.5000 కోట్లు కేటాయించి అభివృద్ధి చేయాలని తెలిపారు. 50 సంవత్సరాలు నిండిన ప్రతి వడ్డెర వృత్తిదారుడికి పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. జిల్లాలో ఉన్న వడ్డెర కోపరేటివ్ సొసైటీలకు ఎలాంటి షరతులు లేకుండా బ్యాంకు లోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ పనుల్లో 30శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. రాబోయే రోజుల్లో వడ్డెర వృత్తిదారుల సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వడ్డెర వృత్తిదారుల సంఘం జిల్లా కార్యదర్శి ఈడ గొట్టి ఒడ్డన్న, ఉపాధ్యక్షుడు బండారి ఎల్లయ్య, జిల్లా ఉపాధ్యక్షులు ఏత్తరి చందర్, పల్లప్ ఎంకటి, కొమురి వెంకటి, కంది ఎల్లయ్య, డి.గండికోట శీను, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వడ్డెర వృత్తిదారుల సంఘం జిల్లా సలహాదారుడు వెంకటేష్

నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలి

- ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పి.ప్రసాద్

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ



వాహనదారులు నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ పి.ప్రసాద్ అన్నారు. నిజామాబాద్ నగరంలోని గోదాంరోడ్డు ప్రాంతంలో వాహనాదారులకు రోడ్డు భద్రత మసోత్సవంలో భాగంగా వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని అన్నారు. రాంగ్ రూట్లో డ్రైవింగ్ చేయవద్దని, వాహనాలకు నెంబర్ ప్లేట్లు కరెక్ట్‌గా ఉపయోగించాలని తెలిపారు. ద్విచక్ర వాహనాలు ముఖ్యంగా సౌండ్ పొల్యూషన్ చేయకుండా వాహనాలను నడపాలని, గూడ్స్ వాహనాలలో ప్యాసింజర్ ప్రయాణించవద్దని, బైక్‌పై ఇద్దరికి మించి డ్రైవింగ్ చేయవద్దని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ కానిస్టేబుల్స్, వాహనదారులు పలువురు పాల్గొన్నారు.

ఎడపల్లిలో ముగ్గుల పోటీలు

- గెలుపొందిన వారికి బహుమతులు అందజేత

నవతెలంగాణ-ఎడపల్లి

దేశంలో మహిళలకు అతి ముఖ్యమైన పండుగ సంక్రాంతి అని జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షురాలు రజిత యాదవ్ అన్నారు. శనివారం ఎడపల్లి మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ముగ్గుల పోటీలలో ఆమె పాల్గొని మాట్లాడారు. సంక్రాంతి పండుగ వచ్చిందంటే తెలుగు రాష్ట్రాలలో మహిళలకు ఎంతో సంతోషంగా ఉంటుందని ఆమె గుర్తు చేశారు. కేవలం ముగ్గులే కాకుండా తెలుగుదనం ఉట్టిపడేలా సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబిస్తాయని తెలిపారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలో వారం రోజుల పాటు పండుగ వాతావరణం నెలకొంటుందని గుర్తుచేశారు. ముగ్గుల పోటీలలో ప్రతిభ కనబరిచిన మహిళలకు చిన్నారులకు ఆమెతో పాటు సంబంధిత శాఖ అధికారులు సిబ్బంది, బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జైతాపూర్ సింగిల్ విండో అధ్యక్షులు సత్యనారాయణ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఈరంటి లింగం, నాయకులు కామప్ప, భాస్కర్‌రెడ్డి, ఎల్లయ్య యాదవ్, రత్నాకర్, నవీన్, ఐకెపి ఏపీఎం గంగారాం, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు పాండురంగం, సంజీవ్, రషీద్, భాస్కర్, ఎడపల్లి మంగల్‌పాడు గ్రామాలతో పాటు ఇతర గ్రామాల వీవోఏలు లతా, కుమ్మరి పుష్ప, రేణుక, ఆయా గ్రామాల వీవోఏలు, స్వయం సహాయక సంఘం మహిళలు తదితరులు పాల్గొన్నారు.


ముగ్గుల పోటీల్లో పాల్గొన్న వారికి బహుమతులు అందజేత


నిజామాబాద్: హోవార్డ్ స్కూల్‌లో ముగ్గులు వేస్తున్న విద్యార్థినిలు



పతంగిని ఎగిరేస్తున్న విద్యార్థులు


వాసు స్కూల్‌లో ముగ్గులను పరిశీలిస్తున్న పలువురు


ఆర్మూర్: ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో భోగి, సంక్రాంతి వేడుకలు

ఘనంగా సంక్రాంతి వేడుకలు


ఆర్మూర్: లిల్లీపుట్ పాఠశాలలో...


ధర్పల్లి: శ్రీ విద్య పాఠశాలలో...

నవతెలంగాణ-విలేకరుల బృందం

హోవార్డ్ స్కూల్‌లో..

నిజామాబాద్ సిటీ : నగరంలోని హెవార్డ్స్ హైస్కూల్లో సంక్రాంతి పండుగ సంబరాలు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ముగ్గుల పోటీలు, గాలిపటాలు ఎగరవేయడం, భోగి పండ్లు పోయడం, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శశికళ మాట్లాడుతూ సూర్యుడు భ్రమించే కక్షలో మార్పులు రావడంతోనే మకర సంక్రాంతి తర్వాత వసంత ఋతువు ప్రారంభమవుతుందని విద్యార్థులకు వివరించారు. కరస్పాండెంట్ టీవీ మూర్తి మాట్లాడుతూ.. గాలిపటం ఎగరవేసే సమయంలో పిల్లలు తగినంత స్థలం చూసుకొని గాలిపటం ఎగరవేయాలని, డాబాలపైన ఎగరవేయవద్దని, గాలిపటం తెగిపోయిన గాలిపటలు పట్టుకోవడానికి రోడ్డు మీద ఇష్టానుసారంగా పరిగెత్తి ప్రమాదాలకు గురికావొద్దని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విదార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వాసు స్కూల్లో..

నగరంలోని దుబ్బా ప్రాంతంలో గల వాసు హైస్కూల్లో సంక్రాంతి పండగ సందర్భంగా విద్యార్థులకు ముగ్గుల, గాలిపటాల ఎగరవేయడం పోటీలను నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ కర్నాటి వాసు పర్యవేక్షణ చేసి, మంచి ముగ్గులు వేసిన విద్యార్థులను ప్రశంసించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను గుర్తించడానికి ఇటువంటి వేడుకలు ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో భోగి, సంక్రాంతి..

ఆర్మూర్ : పట్టణ శివారులో గల ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శ్రీ మానస గణేష్ ముందుగా భోగిమంటలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం భోగిమంటల చుట్టూ గొబ్బిపాటలు పాడుతూ నృత్యాలు చేశారు. తర్వాత పాఠశాల పరిపాలన అధికారిని పద్మ చిన్నారులకు భోగి పండ్లు పోసి ఆశీర్వదించారు. విద్యార్థులకు రంగవల్లుల పోటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. బాలురకు పతంగులు ఎగరవేసే పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులతో అభినందించారు. పాఠశాల కరస్పాండెంట్ మాట్లాడుతూ.. పిల్లలకు పండగలు, సంస్కృతి, సాంప్రదాయాల గురించి కనీస అవగాహన కల్పిస్తూ, వారిలోని కళా నైపుణ్యాన్ని అభినందించారు. వారు ఈ రంగవల్లులను ఎంతో అందమైన రంగులతో అలంకరించి కనులవిందు చేశారు. వారి జీవితంలో అన్ని రంగాలలో విజయం సాధించాలని చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

లిల్లీపుట్ పాఠశాలలో..

పట్టణంలోని లిల్లీపుట్ పాఠశాలలో సంక్రాంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులు సైతం పాల్గొన్నారు. లిల్లీపుట్ పాఠశాల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులకు వివిధ రకాల ఆటల పోటీలు నిర్వహించారు. మ్యూజికల్ చైర్ రన్నింగ్, కాంపిటీషన్ వన్ మినిట్, గేమ్ హెయిర్ స్టైల్, మెహందీ లాంటి ఎన్నో ఆసక్తికరమైన ఆటలు నిర్వహించారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరూ ముగ్గుల కాంపిటీషన్‌లో పాల్గొని ఎంతో చక్కని ముగ్గులు వేశారు. హరిదాసు వేశంలో అలరించారు. భోగిమంటలతో పాఠశాల అంతా ఎంతగానో పండుగ వాతావరణం నెలకొంది. అంతేకాకుండా బొమ్మలు కొలువు వేసి చిన్న పిల్లల పైన రేగిపండ్లు వేసి విద్యార్థుల తల్లిదండ్రులు వారిని ఆశీర్వదించారు.

ఎన్నో రకాల వివిధ కార్యక్రమాలను పాఠశాల మొత్తం చక్కని పండగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో భాగంగా ఆటల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ప్రిన్సిపాల్ దాస్ బహుమతులను అందజేశారు. ఈ ముగ్గుల పోటీలో పాల్గొన్న పేరెంట్స్‌కు ప్రతి ఒక్కరికీ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్రీ విద్య పాఠశాలలో..

ధర్పల్లి : మండలంలోని దుబ్బాక గ్రామంలోని శ్రీ విద్య పాఠశాలలో సంక్రాంతి సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సాయి కృష్ణ, విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు పాఠశాలలోని ఆవరణలో తీరొక్క రంగులతో విద్యార్థులు చూడముచ్చట కలిగించే అందమైన ముగ్గులు వేసి సంక్రాతి పండగ సంబరాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఒడ్డె ఓబన్న 218వ జయంతి వేడుకలు


ఓబన్న చిత్రపటానికి నివాళి

నవతెలంగాణ-ధర్పల్లి

తెలంగాణ బీసీ అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాముని సుదర్శన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మామిడి విఠల్ ఆధ్వర్యంలో ఒడ్డె ఓబన్న జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబన్న చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓబన్న పోరాట స్ఫూర్తిని కొనసాగించాలని, వారి అడుగుజాడల్లో బడుగు బలహీన వర్గాలు నడువాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణా బీసీ అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాముని సుదర్శన్, బీసీ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మామిడి విట్టల్, బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు చింతల శంకర్, జిల్లా సోషల్ మీడియా ఇన్చార్జి రాజేందర్, నాయకులు నవీన్, పెంటయ్య, మహేందర్, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

పీసీసీ చీఫ్‌ను కలిసిన వెల్‌నెస్ ఆసుపత్రి బృందం


మహేష్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-బోధన్

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌ను వెల్‌నెస్ ఆసుపత్రి ప్రతినిధులు మర్యాదపూర్వకంగా శనివారం కలిసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. పిసిసిని శాలువాతో సన్మానించారు. పీసీసీ చీఫ్‌ను కలిసిన వారిలో వెల్నెస్ ఆసుపత్రి వైస్ ప్రెసిడెంట్ బోదు అశోక్ కుమార్, ఆసుపత్రి జనరల్ మేనేజర్ ఎం.రాజేష్ ఉన్నారు. త్వరలో నిజామాబాద్‌లో వెల్‌నెస్ ఆసుపత్రి ఏర్పాటు చేస్తున్నట్టు ఆసుపత్రి ప్రతినిధులు తెలిపారు.

యువతే దేశానికి శక్తి

నేడు జాతీయ యువజన దినోత్సవం



యువతే దేశానికి అసలైన శక్తి.. యుక్తి. అలాంటి యువత దారి తప్పితే దేశ భవిష్యత్తుకే ప్రమాదం. జీవితంలో అల్లరి ఉండాలి కానీ జీవితం అల్లరి పాలు కాకుండా చూసుకోవాలి. అది శృతి మించితే వారికే కాక తల్లిదండ్రులకు ఇబ్బందులు తప్పవు. సమాజంలో రోజురోజుకు చోటుచేసుకుంటున్న విపరీత ధోరణిలు, చెడు పోకడలు, అరాచకాలు, అసాంఘిక కార్యకలాపాలన్నింట్లో యువత ముందు వరుసలో ఉంటుంది. విద్యార్థి దశనుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకొని ఎంచుకున్న మార్గంలో నడవకుండా పేడదోవపడుతుంది. తద్వారా వారి భవిష్యత్తు నాశనమై సమాజంలో గౌరవం కోల్పోతున్నారు. కన్నవారికి కూడా వేదన మిగిలిస్తున్నారు. యువతకు దిశానిర్దేశం చేసిన స్వామి వివేకానందుని జయంతి నేడు ఆదివారం. ఈ సందర్భంగా నవతెలంగాణ అందిస్తున్న ప్రత్యేక కథనం.

నవతెలంగాణ-ఆర్మూర్

ఎంజాయ్ పేరుతో చెడు అలవాట్లకులోనై..

మద్యం, ధూమపానం, గుట్కా, పేకాట వంటి వ్యసనాల బారిన పడి ఎందరో తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. ఎంజాయ్ పేరుతో చెడు అలవాట్లకు లోనై వాటికి బానిసలుగా మారి బంగారు భవిష్యత్తును బలి చేసుకుంటున్నారు. అందుకే వాటికి దూరంగా ఉండడం మంచిది. తాగడం, పేకాట, వ్యభిచారం వంటి అసాంఘిక కార్యకలాపాలతో సమాజంలో గౌరవం కోల్పోవడం ఖాయం. వాటి జోలికి వెళ్లడమే కాదు, అలాంటి పనులకు అలవాటు పడిన స్నేహితులకు దూరంగా ఉండడం ద్వారా వాటి వైపు మళ్లకుండా ఉండవచ్చు. సమాజం అందరినీ పరిశీలిస్తోంది. అందుకే సమాజంలో విలువలు పోగొట్టుకుని బతకడం కష్టం. విలువలను పాటించడం ద్వారా మంచి పేరును తెచ్చుకోవచ్చు.

లక్ష్య సాధనపైనే ధ్యాస ఉండాలి..

చదువుకుంటున్న యువత అయినా, ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగ యువత అయినా తాము నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించుకోవడంపైనే ధ్యాస ఉంచగలిగితే సులువుగా గమ్యం చేరుకోగలుగుతారు. విశాల దృక్పథంతో ఆలోచనలు చేయాలి. సంస్కృతి, సాంప్రదాయాలను గౌరవించాలి. సమాజం గురించి అవగాహన పెంచుకోవడం అవసరం. లక్ష్యాన్ని సాధించుకునే క్రమంలో కష్టాలు ఎన్ని వచ్చినా బెదరకుండా ముందుకు సాగాలి. నిర్మాణాత్మకమైన ఆలోచనలతో ఆత్మవిశ్వాసంతో, ఆత్మస్థైర్యంతో లక్ష్యాన్ని సాధించుకునే ప్రయత్నం చేస్తే విజయం తప్పకుండా మీ బానిస అవుతుంది. ఇందుకోసం సాధన చేయడమే మార్గమని మేధావులు మానసిక నిపుణుల సలహా. సాధనతోనే ఏ కష్టాన్నయినా సాధించవచ్చని వారు ఎంతోమందికి కౌన్సెలింగ్‌లో చెబుతున్నారు.

21 ఏళ్ల వయసు నుంచే సేవా కార్యక్రమాలు..

పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు తులసి పట్వారి ఆయన 21 సంవత్సరాల వయస్సు నుంచి స్వామి వివేకానంద, అబ్దుల్ కలాం లాంటి మహా వ్యక్తులను ఆదర్శంగా తీసుకొని స్వచ్ఛంద కార్యక్రమాలు చేస్తున్నాడు. కోవిడ్, లాక్‌డౌన్ సమయాలలో పట్టణంలో భోజనం లేక ఇబ్బంది పడుతున్న యాచకులకు, కూలీలకు, వృద్ధులకు పట్టణ బస్టాండ్, పెర్కిట్, మామిడిపల్లి ప్రాంతాలలో భోజనం ప్యాకెట్లను అందజేశాడు. కోవిడ్ క్లిష్ట పరిస్థితుల్లో మొదటి వేవ్, సెకండ్ వేవ్‌లో ఉచితంగా మాస్కులు, శానిటైజర్స్, అల్పాహారం, వాటర్ జ్యూస్ పంపిణీ సైతం అందించారు. జిల్లాకు గత కలెక్టర్‌గా పనిచేసిన నారాయణరెడ్డి, ప్రస్తుత కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, రాజకీయ నాయకులు సైతం తులసి పట్వారి సేవ కార్యక్రమాలకు అభినందనలు తెలిపారు. పట్టణతో పాటు మండలంలోని వివిధ గ్రామాలలోని ప్రభుత్వ పాఠశాలలో సైతం మహనీయుల జీవిత చరిత్రల పుస్తకాలను సైతం అందజేశాడు. మాజీ రాష్ట్రపతి, శాస్త్రవేత్త అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకొని మండలంలోని అంకాపూర్ గ్రామ లాలన వృద్ధాశ్రమంలో వృద్ధులకు స్టాండ్ వాకర్సును అందజేశారు. ఒక ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయునిగా ఉంటూ 2007 నుంచి విద్యార్థులలో చైతన్య స్ఫూర్తి అంశాలపై అవగాహన సదస్సులు ప్రారంభించారు. 2009లో మొట్టమొదటిసారి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించి విజయ పబ్లిక్ స్కూల్లో చదివే రఘువంషిని రాష్ట్రస్థాయికి తీసుకెళ్లి 20వేల నగదు బహుమతి గెలుపొందారు. 2012లో సైన్స్ టాలెంట్ టెస్ట్‌కు మండల స్థాయి పోటీలు నిర్వహించారు. ప్రజ్ఞ ఐఐటి స్కూల్ సహకారంతో జిల్లాస్థాయిలో నిర్వహించి రాష్ట్రస్థాయికి పలువురు విద్యార్థులను తీసుకెళ్లారు. 2012లో పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అంశంపై మున్సిపల్ కమిషనర్‌తో మొక్కలు నాటించి వివిధ కాలనీలకు అందజేశారు. ఇదే సంవత్సరం అక్టోబర్ రెండు గాంధీ జయంతిన రోటరీ క్లబ్ ఆఫ్ ఆర్మూర్ సహకారంతో విద్య హైస్కూల్‌లో గాంధీ చిన్నతనం నుంచి మరణాంతరం వరకు గల ఫోటో గ్యాలరీ ప్రదర్శించారు. సొంత ఖర్చులతో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్లాస్టిక్ నిర్మూలనకై, ప్లాస్టిక్ వల్ల కలిగే అనర్థాలను కూరగాయలు అమ్ముకొని ప్రజలకు వ్యాపారస్తులకు అవగాహన కల్పించారు.

ఓటమి భయపెడుతుంది



నేటి యువత యువజన సంఘాలను ఏర్పాటు చేసి సమాజ సేవ చేయాలి. నిరంతరం వెలిగే సూర్యున్ని చూసి చీకటి భయపడినట్టే నిరంతరం శ్రమించే వాడిని చూసి ఓటమి భయపడుతుందని స్వామి వివేకానందుడు చెప్పిన సూక్తులు నేటి యువతరం పాటించాలి. అనుకున్న లక్ష్యాలను సాధించి ముందుకు కదలాలి. **- ఎం.కె.నాగరాజు, యువ న్యాయవాది, ఆర్మూర్.**

వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలి



యువత తలుచుకుంటే ఏదైనా సాధించవచ్చు. వికాసాన్ని పెంపొందించుకుంటూ, యువత చెడు ఆలోచనలు మానుకొని నిర్దేశించుకున్న లక్ష్య సాధనకు అంకితమై ముందుకు కదిలితే తప్పకుండా విజయం సాధించ వచ్చు. **- తులసి పట్వారి కుమార్, సామాజిక సేవకుడు, ఆర్మూర్.**

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ


జక్రాన్‌పల్లి : కొలిప్యాక్‌లో చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి/జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలోని పలువురు లబ్ధిదారులకు బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను శనివారం అందజేశారు. బిఆర్ఎస్ మండల పార్టీ కార్యాలయంలో గ్రామానికి చెందిన ఐదుగురు లబ్ధిదారులు వెలమల గంగాధర్, దుంపల నరసయ్య, ఏ.తిరుపతి, జె.ప్రసాద్ రావు, ఎన్.గౌతమి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కొంటికంటి నరేందర్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షులు నవాబ్ పాషా, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు సంత రాజేశ్వర్, మల్కాయ్య గంగారం, పార్శపు చిన్న బాపయ్య, తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి : మండలంలోని కొలిప్యాక్ గ్రామంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి ఆదేశానుసారం లబ్ధిదారులకు అందజేసినట్టు మాజీ ఎంపీటీసీ మద్దుల రమేష్ తెలిపారు. కార్యక్రమంలో ఎక్స్ సొసైటీ చైర్మన్ మామిడి భాస్కర్, పన్నాల తిరుపతి, దినేష్, శ్రీనివాస్, శంకర్, మోహన్, సాగర్, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

అలాగే మండలంలోని పలు గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను నిజామాబాద్ రూరల్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు వినోద్ శనివారం అందజేశారు. కార్యక్రమంలో గన్న లక్ష్మణ్, సైకిల్ టెక్స్ అక్బర్, సాయిలు, నట్టా తిరుపతి, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో కిందపడి ఒకరు మృతి

నవతెలంగాణ-ధర్పల్లి

మద్యం మత్తులో కిందపడి ఒకరు మృతిచెందారు. ఎస్ఐ రామకృష్ణ వివరాల ప్రకారం.. మండలంలోని హొన్నాజీపేట్ గ్రామానికి చెందిన అంతి జగదీశ్వర్ (42) అనే వ్యక్తికి పోతంగల్ గ్రామానికి చెందిన హిందూజతో వివాహమైంది. వీరికి ఒక కూతురు ఉంది. అయితే గత నాలుగు సంవత్సరాల క్రితం భార్యాభర్తల మధ్య గొడవ చోటుచేసుకోవడంతో అప్పటి నుంచి భార్య పుట్టింటికి వెళ్లింది. దాంతో జగదీశ్వర్ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో ఈ ఈనెల 10న రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఎంతసేపైనా ఇంటికి తిరిగి రాలేదు. గ్రామంలోని చెరువుకు వెళ్లే దారిలో గల డ్రైనేజీలో జగదీశ్వర్ బోర్ల బొక్కల పడి చనిపోయి ఉన్నట్టు గ్రామస్తులు శనివారం ఉదయం గుర్తించారు. దీంతో మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


బీజేపీ మండలాధ్యక్షులుగా కోల ఇంద్రకరణ్ నియామకం



నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని పోచారం గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ కోల ఇంద్రకరణ్‌ను బీజేపీ మండలాధ్యక్షులుగా రెండవసారి నియమాకమయ్యారు. రెండోసారి తనను మండలాధ్యక్షుడిగా నియమించిన ఎంపీ ధర్మపురి అరవింద్, రాష్ట్ర నాయకులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, వడ్డీ మోహన్ రెడ్డి, బోధన్ నియోజకవర్గ బీజేపీ అసెంబ్లీ ఇంచార్జి కూరెళ్ల శ్రీధర్ రెడ్డి తదితరులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కిరాణ షాపుల్లో కాలం చెల్లిన పానీయాలు



నవతెలంగాణ-బోధన్

పట్టణంలోని కిరాణ షాపులలో కాలం చెల్లిన ఎనర్జీ డ్రింక్‌లు విక్రయిస్తున్న ఘటన వెలుగుచూసింది. రెండు రోజుల క్రితం ఓ విద్యార్థి పాఠశాల సమీపంలో గల ఓ కిరాణ షాపులో జోల్ట్ అనే కంపెనీకి సంబంధించిన ఎనర్జీ డ్రింక్‌ను కొనుగోలు చేశాడు. ఆ బాటిల్‌ను పరిశీలించగా గడువు ముగిసింది. ఇలా కాలంచెల్లిన శీతల పానీయాలను, ఎనర్జీ డ్రింక్‌లను కిరాణ షాపు నిర్వాహకులు యథేచ్ఛగా విక్రయిస్తున్నారు. దాంతో వినియోగదారులు వాటిని తాగి అనారోగ్యం బారిన పడుతున్నారు. పలుచోట్ల విద్యార్థులు నాసిరకం ఆహార పదార్థాలు తిని అనారోగ్యానికి గురైన ఘటనలు ఎన్నో వెలుగుచూశాయి. ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి వ్యాపార సంస్థల్లో తనిఖీలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-పోతంగల్

మండలంలో సాయిబాబా మందిరం ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాసరెడ్డి చేతుల మీదుగా 62 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 120 కళ్యాణ మండపాలను నిర్మించారని, వాటిని నామమాత్రపు నిర్వహణ ఛార్జీల రుసుముతో ఉపయోగించుకోవాలని తెలిపారు. రోడ్ల నిర్మాణానికి, మరమ్మతులకు మంజూరు జాబితాను చదివి వినిపించారు. మండలంలోని గ్రామాల వారీగా, కళ్యాణలక్ష్మీ, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. అనంతరం ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్‌పర్సన్ కాసుల బాలరాజ్‌తో కలిసి బాలాజీ మందిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ సంస్థల ప్రతినిధులు, గ్రామాల మాజీ సర్పంచులు, అభిమానులు శెట్టి గంగారాం, పీరాజీ, సూదం నగేష్ తదితరులు పాల్గొన్నారు.

సామ్రాజ్యవాద, కులవర్గ దోపిడీకి వ్యతిరేకంగా ఉద్యమించాలి

- బహుజన లెఫ్ట్ పార్టీ(బహుజన కమ్యూనిస్టు) బీఎల్పి అధ్యక్షులు దండి వెంకట్

నవతెలంగాణ-కంఠేశ్వర్

సామ్రాజ్యవాద, కులవర్గ దోపిడికి వ్యతిరేకంగా ఉద్యమించాలని బహుజన లెఫ్ట్ పార్టీ(బహుజన కమ్యూనిస్టు) బిఎల్పి అధ్యక్షులు దండి వెంకట్ పిలుపునిచ్చారు. శనివారం నిజామాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో బిసి కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఒడ్డె ఓబన్న జయంతి వేడుకలు న్విహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామ్రాజ్యవాద వ్యతిరేకంగా ఉద్యమించిన యోధుడు ఒడ్డె ఓబన్న జయంతి వేడుకలను 2024 నుంచి నిర్వహిస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి, 2025లో నిర్వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడి రాష్ట్ర ప్రభుత్వానికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలిపారు. గత చరిత్ర తెలియని వారికి నూతన చరిత్రను నిర్మించలేరని డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ చెప్పిన మాటలను దండి వెంకట్ గుర్తు చేశారు. కార్యక్రమంలో బిసి జిల్లా అభివృద్ధి అధికారి శ్రవంతి, అసిస్టెంట్ బిసి వెల్ఫేర్ ఆఫీసర్ గంగాధర్, బిసి సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఉన్నవారికి కాదు.. పేదవారికే ఇందిరమ్మ ఇండ్లు

- మోడల్ ఇందిరమ్మ ఇల్లుకు భూమిపూజ
- రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు పోచారం, ఆగ్రో చైర్మన్ కాసుల


మోడల్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న పోచారం

నవతెలంగాణ-వర్ని

రాష్ట్ర ప్రభుత్వం పేదలకు గూడు కల్పించాలనే మంచి సంకల్పంతో ఇందిరమ్మ ఇండ్లను సంక్రాంతి తరువాత మంజూరు చేస్తున్నట్టు బాన్సువాడ ఎమ్మెల్యే రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఆగ్రో చైర్మన్ కాసుల బాలరాజు తెలిపారు. మండలంలోని ఎంపీడీఓ ప్రాంగణంలో ఇంజనీర్లు తయారు చేసిన ఇందిరమ్మ ఇల్లు మోడల్ హౌస్‌ను పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఆగ్రో చైర్మన్ కాసుల బాలరాజు కలిసి భూమిపూజ చేసి ప్రారంభించారు. అనంతరం తహసీల్దార్ సాయిలు ఏర్పాటు చేసిన సమావేశంలో పోచారం మాట్లాడుతూ.. నియోజకవర్గంలో పేదలకే ఇండ్లు ఇస్తామని తెలిపారు. ఇండ్లు లేని పేదలను గుర్తించి వారికి ఇల్లు కట్టుకోవడానికి రూ.5 లక్షలు ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో జీఎస్‌టి కట్ చేసి రూ.4లక్షలు మాత్రమే ఇచ్చిందని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం నేరుగా 5లక్షలు లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తారని అన్నారు. అనంతరం వర్ని, చందూర్ మండలాల్లో కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కులకర్ణి సురేష్ బాబా, వైస్ చైర్మన్ లక్ష్మణ్, మాజీ జడ్పీటీసీలు హరిదాస్, అంబర్‌సింగ్, నారోజీ గంగారాం, మాజీ సర్పంచ్ నెమని విరాజ్, మండల అధ్యక్షులు గిరి, మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ గోపాల్, మైనార్టీ అధ్యక్షులు ఏమ్‌డీ భారీ, చందూర్ మండల పిఏసిఎస్ చైర్మన్ అశోక్ యాదవ్, కర్లం సాయరెడ్డి, సత్యనారాయణ, దేవిసింగ్, మాజీ ఏఎంసీ చైర్మన్ మూడ్ అంబర్ సింగ్, ఏఎంసీ డైరెక్టర్లు సుధాకర్ రావు, నామాల సాయిబాబా, శనిగరం కిషన్, తహసీల్దార్ సాయిలు, శాంత, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి వెళ్తున్నారా? జాగ్రత్త

- పోలీసులకు సమాచారం ఇవ్వండి
- ఇంచార్జీ పోలీస్ కమిషనర్ సింధు శర్మ



నవతెలంగాణ-కంఠేశ్వర్

సంక్రాంతి పండుగ నేపథ్యంలో సెలవుల్లో తమ సొంతూర్లకు వెళ్లే ప్రజలు పోలీస్ శాఖ నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని ఇన్చార్జి పోలీస్ కమిషనర్ సింధు శర్మ శనివారం తెలిపారు. ఊరు వెళ్లేటప్పుడు ఖరీదైన వస్తువులు ఉంచకుండా బ్యాంక్ లాకర్లో పెట్టుకోవాలని సూచించారు. ఊరెళు న్నామన్న విషయాన్ని సోషల్ మీడియాలో పోస్టు చేయొద్దని పేర్కొన్నారు. డోర్స్‌కు సెంట్రల్ లాకింగ్ సిస్టం వాడాలని, గ్రామాలలోని ప్రజలు సంబంధిత పోలీస్ స్టేషన్ వారికి సమాచారం ఇవ్వాలని తెలిపారు. సి.సి కెమెరాలు ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు చూస్తూ అపరిచిత వ్యక్తులు వస్తే వారి సమాచారం పోలీస్ వారికి తెలియజేయాలని వివరించారు. శివారు ప్రాంత కాలనీలలో తాళం వేసిన ఇండ్లను అపరిచిత వ్యక్తులు ఉదయం వేళ వెతకటం, రాత్రి వేళ చోరీలకు పాల్పడే అవకాశమున్న నేపథ్యంలో అలాంటి వారిపై నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ఇరుగు పొరుగు వారిని ఇంటిని కనిపెట్టి ఉండమని చెప్పాలని తెలిపారు. పక్కింటి వారి ద్వారా ఇంటికి సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకోవడం మంచిదని సూచించారు. ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వదలుచుకునేవారు మీ సమీప పోలీస్ స్టేషన్లను సంప్రదించాలని, లేదా డయల్ 100ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ప్రజలకు సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు

నిజామాబాద్ ప్రజలకు పోలీస్ శాఖ తరపున సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్నట్టు నిజామాబాద్ ఇన్చార్జి పోలీస్ కమిషనర్ సింధు శర్మ శనివారం తెలిపారు. ఇంటిల్లిపాది అంగరంగ వైభవంగా మూడు రోజుల పాటు భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను జరుపుకోవాలని సూచించారు. ఎల్లప్పుడు ప్రజలు, పోలీస్ సిబ్బంది స్నేహపూర్వకంగా, సోదరభావంతో మెలగాలని కోరుతున్నట్టు పేర్కొన్నారు.

కామ్రేడ్ శావులం సాయిలు వర్ధంతి

నవతెలంగాణ-ఎడపల్లి

మండలంలోని మంగల్‌పాడ్ గ్రామానికి చెందిన శావలం సాయిలు వర్ధంతి వేడుకలను సిపిఐ(ఎంఎల్) ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు గుమ్ముల గంగాధర్ మాట్లాడుతూ.. నిరుపేద పేద బడుగు బలహీన వర్గాల వారికి అండగా పోరాటం చేశారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో మాజీ వైస్ ఎంపీపీ జితేందర్ నాయక్ శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మందిరంలో అన్నదానం సత్రం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, మాజీ ఎంపీటీసీ నర్సారెడ్డి, తదితరులున్నారు.

IN THE COURT OF THE HON'BLE VI.JUNIOR CIVIL JUDGE ::: CITY CIVIL COURTS AT HYDERABAD
OS.NO.3461/2024

Between:
State Bank of India, MC Tank Bund Branch,GHMC Building Municipal Complex Liberty, Tankbund Road, Hyderabad, Telangana- 500 063 Rep.by its Branch Manager
...Plaintiff

And
Mr.Ramancha Suresh
....Defendant

To
Mr. Ramancha Suresh, H no.10-9-412, Sai Nagar, Nizamabad, Telangana - 503001 O/o Employee code STGOTEL057 Govt.Of Telangana Municipal Corporation, Nizamabad, Telan gana-503001

Please take notice that the above named plaintiff instituted the above suit against you for recovery of Rs 8,96,255 -00 Ps. You are hereby summoned to appear in this court in person or by pleader duly instructed and able to answer all material questions on 21-01-2025 at 10.30 AM. In default of your appearance the suit will be heard and decided in your absence.

//BY ORDER OF THE COURT//
D.K. Lakshmi Kumari,
Advocate
Flat no.304,
H.No.8-90/34/5 & 8-90/35/5
Manikanta Paradise Apart.
Dwarakanagar, Phase-II
Uppal, Hyderabad,
Pin Code- 500 039
Cell No. 99488 68080
Counsel for the Plaintiff